కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసిన బిజెపి నేత రవికుమార్‌గౌడ్

నారాయణఖేడ్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :
రోడ్లు, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్‌గౌడ్ శుక్రవారం ఢిల్లీలోని మంత్రి అధికారిక నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సంగారెడ్డి జిల్లా మీదుగా వెళ్లే జాతీయ రహదారుల ప్రస్తుత స్థితిగతులు, కొత్త ప్రాజెక్టుల పురోగతిపై వారు చర్చించారు. ఎన్‌హెచ్161 (సంగారెడ్డి నాందేడ్ అకోల) రహదారి: సంగారెడ్డి నాందేడ్ అకోల జాతీయ రహదారి వల్ల ప్రాంతీయ రవాణా రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులను రవి కుమార్‌గౌడ్ మంత్రికి వివరించారు. ఈ రహదారి వినియోగం వల్ల తెలంగాణ, మహారాష్ట్రల మధ్య వాణిజ్య సంబంధాలు మెరుగుపడటమే కాకుండా, ప్రయాణ సమయం గణనీయంగా తగ్గిందని ఆయన ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. నిర్మాణంలో ఉన్న నిజాంపేట్ నారాయణఖేడ్ బీదర్ జాతీయ రహదారి పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఇటీవల బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియామకమైన రవికుమార్‌గౌడ్‌ను నితిన్‌గడ్కరీ అభినందించారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

అభివృద్ధి పనులు పూర్తి చేయండి : సింధూ ఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: భారతీ నగర్ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తయ్యేందుకు తగు చర్యలు తీసుకోవాలని మాజీ కార్పోరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శ్‌రెడ్డి సైబరాబద్ మున్సిపల్ కమిషనర్ సృజనకు శుక్రవారం వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పోరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ బాంబే కాలనీ కమ్యూనిటీ హాల్‌కు ధరను నిర్ణయించాలని, ఎంఎంటీఎస్ నుంచి అన్నమయ్య ఎన్‌క్లేవ్ వరకు బిటి రోడ్డుకు బడ్జెట్ కేటాయించాలని కమిషనర్‌కు కోరినట్లు పేర్కొన్నారు. డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న హెచ్‌ఎండబ్లుఎస్ఎస్‌బి పనులను త్వరిత గతిన ప్రాసెస్ చేసి హెచ్‌ఎండబ్ల్యుఎస్ఎస్‌బికి పంపాలని కోరినట్లు వివరించారు. ఓల్డ్ ఎంఐజి కాలనీలో స్పోర్ట్స్ ఫైల్‌కు బడ్జెట్ కేటాయించి టెండర్ ప్రక్రియను ప్రారంభించాలన్నారు. కొనసాగుతున్న అభివృద్ధి పనులను కాంట్రాక్టర్ త్వరిత గతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. అభివృద్ధి పనులు పూర్తయ్యేలా తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామి చేసినట్లు మాజీ కార్పోరేటర్ సింధు వివరించారు.

నేడు అందోలు నియోజకవర్గంలో మంత్రి దామోదర్ రాజనర్సింహా పర్యటన

పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి

చౌటకూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: అందోలు నియోజకవర్గంలో ఈ నెల 18న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహా పర్యటించనున్నందున మంత్రి పర్యటనకు ఏర్పాట్లు అధికారులు, కాంగ్రెస్ నాయకులు పూర్తి చేశారు. మంత్రి పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ఉదయం 11 గంటలకు శివంపేట్ మండలం హున్నాపూర్ పాలిటెక్నిక్ కళాశాలలో 43 లక్షల సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన వర్క్ షాప్ షెడ్‌ను మంత్రి ప్రారంభించనున్నారు. ఉదయం 11.30 గంటలకు అందోల్‌లో 1.80 లక్షల నిధులతో నిర్మించిన సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తామరన్నారు. ఉదయం 11.45 గంటలకు అందోలు చెరువు వద్ద 5 కోట్ల నిధులతో నిర్మించనున్న టూరిజం రెస్టారెంట్‌కు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు జోగిపేటలో 20 కోట్ల నిధులతో నిర్మించనున్న సమగ్ర కార్యాలయ సముదాయం నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 12.15 గంటలకు జోగిపేటలో నిర్మించిన గ్రంథాలయం మొదటి అంతస్తు భవనాన్ని ప్రారంభిస్తారు. మధధ్యాహ్నం 12.30 గంటలకు జోగిపేట కాంగ్రెస్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను ప్రారంభించనున్నారు. కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారు.

ఇంటింటికి తిరిగి ఓటర్ మ్యాపింగ్ చేపట్టాలి

-సబ్ కలెక్టర్ ఉహా హారతి

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఉమాహారతి

నాగల్‌గిద్ద, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: ఇంటింటికి తిరిగి ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను చేపట్టాలని నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి అన్నారు. శుక్రవారం నాగల్‌గిద్దలో కొనసాగుతున్న బిఎల్‌ఓల శిక్షణ తరగతులకు సబ్ కలెక్టర్ హాజరై మాట్లాడుతూ ఎలాంటి తప్పులు లేకుండా ఓటర్ జాబితాను రూపొందించాలని బిఎల్‌ఓలకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి, ఎంఈఓ మన్మధకిషోర్ ఉన్నారు.

ఎల్లమ్మ చెరువును సందర్శించిన అడిషనల్ కలెక్టర్

ఎల్లమ్మ చెరువును పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : పట్టణంలోని ఎల్లమ్మ చెరువు వద్ద జరుగుతున్న చెరువు సుందరీకరణ, అభివృద్ధి పనులను జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) అబ్దుల్ అహ్మద్ పరిశీలించారు. శనివారం చెరువు వద్ద జరుగుతున్న పనులను పరిశీలిస్తూ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పనులు నాణ్యతగా, సమయానికి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. చెరువు సుందరీకరణలో ప్రజలకు విశ్రాంతి వాతావరణం కల్పించడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, వార్డ్ కౌన్సిలర్ భూక్య సంపత్ తదితర అధికారులు పాల్గొన్నారు.

జనాభా లెక్కల్లో కురుమలకు అన్యాయం

-కెఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బింగి స్వామి

గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త): రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే గ్రామపంచాయతీలో జనాభా లెక్కలకు సంబంధించిన పత్రాలను అందుబాటులో ఉంచి, ఆన్‌లైన్‌లో పెట్టాలని కురుమ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బింగి స్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కురుమల జనాభాను తక్కువగా చూపిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇకపై విశ్వసించలేమన్నారు.ప్రభుత్వం కురుమల జనాభాను 7 లక్షల 95వేలుగా చూపించడం కురుమసమాజంపై ఉన్న వ్యతిరేకతను నిదర్శనమన్నారు. కురుమల అసలు జనాభా ఎక్కువగా ఉన్నప్పటికీ, ఉద్దేశపూర్వకంగా తగ్గించి చూపించడం ద్వారా వారి హక్కులను దెబ్బ తీసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. వివిధ కులాల జనాభాలను ఎక్కువ తక్కువగా చూపించినట్లు అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. కురుమ సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యలు కులాన్ని నమ్ముకొని ఎదిగిన వారని, ఇప్పుడు అదే కులాన్ని మోసం చేసే ద్రోహులుగా మారారని విమర్శించారు. నియోజకవర్గానికి 15వేల ఓటర్లు ఉన్నప్పుడు, మొత్తం జనాభా ఇంత తక్కువగా ఎలా ఉంటుందో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. త్వరలో కురుమ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో సమగ్ర కురుమల జనాభా లెక్కింపు చేపట్టి నిజాలను బయటపెడతామని తెలిపారు.

సురక్షిత ప్రయాణమే అరైవ్ అలైవ్ లక్ష్యం : డిఎస్‌పి

నారాయణఖేడ్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : ప్రమాదాల బారిన పడకుండా వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు కచ్చితంగా పాటించేలా అవగాహన కల్పించడమే అరైవ్అలైవ్ లక్ష్యమని నారాయణఖేడ్ డిఎస్పి వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి రాజీవ్ చౌక్ వద్ద మానవహారం చేయించి రోడ్డు భద్రత కార్యక్రమం పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడిపి రోడ్డుప్రమాదాలకు గురికాకూడదని ఆయన తెలిపారు. హెల్మెట్ లేనిది వాహనాలు నడపకూడదని అన్నారు తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని ఆయన అవగాహనకల్పించారు. లైసెన్స్ లేనిదే వాహనాలు నడపకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీనివాస్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రావుల శ్రీశైలం, చంద్రశేఖరాచార్య, సంగ్రామ్, పోలీస్ సిబ్బంది రాహుల్ జైపాల్‌రెడ్డి, నికిత విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను కట్టడి చేద్దాం

* మైనర్లకు వాహనాలు ఇవ్వద్దు
* వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి
* తెలంగాణ రాష్ట్ర డిజిపి శివధర్‌రెడ్డి

మాట్లాడుతున్న డిజిపి శివధర్‌రెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త): మనల్ని మనం కాపాడుకుందాం అనుకునేలోపే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలంగాణ రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలోని మహతి ఆడిటోరియంలో నిర్వహించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లోభాగంగా 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర డిజిపి శివధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు వాహనాలను ఎడమ నుంచి ఓవర్‌టేక్ చేయడం తప్పని, అలా చేయడంవల్ల ప్రమాదం జరుగుతుందని తెలిపారు. వాహనాలు రోడ్డుకు ఎడమవైపునకు మాత్రమే నడపాలని, కుడివైపు నుండి ఓవర్‌టేక్ చేసిన తర్వాత తిరిగి ఎడమవైపునకు రావాలన్నారు. మీరు వాహనం నడపడంతోపాటు ముందుగా వచ్చే వాహనాలను గమనించాలని సూచించారు. ఫోర్ వీలర్ నడిపేవారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ప్రజ్ఞాపూర్‌కు చెందిన ఆటో డ్రైవర్లు కాకి యూనిఫాం ధరించి రావడం చూసిన డిజిపి సంతోషించారు. ఆటో వాళ్లకు సమాజంలో మంచి గుర్తింపు ఉందని, ఆటో డ్రైవర్లపై ప్రజలకు నమ్మకం ఉందని చెప్పారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. రోడ్డు భద్రతలపై ఎక్కడి నుంచో వచ్చి మేము చెప్పాల్సిన అవసరం లేదని, ఎవరికి వారు బాధ్యత కలిగి ఉండాలని, రోడ్డుపై వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి ప్రమాదాలు జరగవని వివరించారు. దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగి చేయిపోయినా, కాలుపోయినా పెట్టుకోవచ్చు కానీ ప్రాణంపోతే మాత్రం తిరిగి రాదన్నారు. ఏది ఏమైనా రోడ్డు ప్రమాదాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం ప్రజ్ఞాపూర్‌కు చెందిన ఆటో డ్రైవర్లకు యూనిఫాం, కంటి అద్దాలను అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కె.హైమావతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రణాళికలో భాగంగా మూడోవారం పోలీస్ వారి ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్‌లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం రోడ్డు ప్రమాదాల గురించి ఎప్పటికప్పుడు అవగాహన కల్పించినా, ప్రమాదాలను అరికట్టలేకపోతున్నామన్నారు. చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని, ప్రాణం చాలా విలువైందని, రోడ్డు ప్రమాదంలో ఇంటిపెద్దను కోల్పోతే ఆ లోటును ఎవరూ తీర్చలేరన్నారు. రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట సిపి రష్మీ పెరుమాళ్, గజ్వేల్ ఏసిపి నర్సింలు, సిఐ రవికుమార్, ట్రాఫిక్ సిఐ మురళి, అడిషనల్ సిఐ ముత్యంరాజుతో పాటు అడిషనల్ ఐపిఎస్‌లు, ఆర్టీవో, వివిధ శాఖల అధికారులు, జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ల సిఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో గేట్ మీటింగ్‌లో పాల్గొన్న జేఏసి నాయకులు, కార్మికులు

ఆర్టీసీని ప్రైవేటుపరం చేసే కుట్రలు ఆపాలి

-గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో ముందు ఆర్టీసీ కార్మికుల గేట్ మీటింగ్

గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త): ఆర్టీసీని ప్రైవేటుపరం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆరోపిస్తూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో ముందు కార్మికులు శుక్రవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికుల జేఏసి నాయకులు జక్కుల నర్సింలు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని ఆర్టీసీ కార్మికులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ విజయవంతంగా అమలుచేస్తూ ప్రభుత్వానికి మంచిపేరు తీసుకువస్తున్నారని తెలిపారు. ఈ పథకం అమలుతో డ్రైవర్లు, కండక్టర్లపై పని ఒత్తిడి విపరీతంగా పెరిగిందని, రద్దీ బస్సుల్లో అనుకోకుండా చిన్న చిన్న తప్పిదాలు జరిగితే కార్మికులను ఉద్యోగాల నుండి తొలగించడం అన్యాయమని మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వమే ఆర్టీసీకి చెందిన భూములు, ఆస్తులు, వర్క్‌షాపులు, డిపోలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ హక్కుల కోసం, ఆర్టీసీ ఆస్తులను కాపాడుకునేందుకు పోరాటం తప్పదని అన్నారు. 22న ఆర్టీసీ బంద్‌కు ప్రజలు సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో జేఏసి నాయకులు నర్సింలు, అంబదాస్, పద్మ, కరీముద్దీన్, సిద్ధరాములు, మహేష్, కృష్ణ, గఫూర్, శ్యాంసుందర్, శంకర్ పాల్గొన్నారు.

నేటి నుంచి పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

రాయపోల్, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త): ఈనెల 18వ తేదీ శనివారం నుండి 20వ తేదీ సోమవారం వరకు కొత్తపల్లి గ్రామంలోగల పెద్దమ్మ తల్లి ఆలయం తృతీయ వార్షికోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 18వ తేదీన గణపతి పూజతో ప్రారంభమవుతాయని, అనంతరం గంగపూజ, బోనాలు కొనసాగుతాయన్నారు. 19వ తేదీన పల్లకి సేవ, పుట్ట బంగారం, పెద్దమ్మ బోనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. రాత్రి సమయంలో పెద్దమ్మ కథ కార్యక్రమం భక్తులను ఆధ్యాత్మిక లోకంలో మెంచెత్తనుంది. 20వ తేదీ సోమవారం అమ్మవారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరగనుంది. అదేరోజు అన్నదాన కార్యక్రమం, బోనాల ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మాట్లాడుతున్న డిఆర్‌డిఏ అదనపు పిడి సుధీర్‌బాబు

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

-డిఆర్‌డిఏ అదనపు పిడి సుధీర్‌బాబు

రాయపోల్, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త):
మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం ద్వారా కుటుంబాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సిద్దిపేట జిల్లా డిఆర్‌డిఏ అదనపు పిడి సుధీర్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం రాయపోల్ మండలం మహిళా సమాఖ్య భవనంలో నిర్వహించిన ఉద్యమ ఆధార్, ఐకెపి కొనుగోలు శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే వారి కుటుంబాలు అభివృద్ధి దిశగా పయనిస్తాయని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను స్వయం సహాయక సంఘ సభ్యులు సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి మహిళ తప్పనిసరిగా ఉద్యమ ఆధార్ నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఉద్యమ ఆధార్ ద్వారా మహిళలకు బ్యాంకుల నుండి సూక్ష్మ రుణాలు సులభంగా లభిస్తాయని వివరించారు. వచ్చే యాసంగి సీజన్‌లో కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. గ్రామ సంఘ అధ్యక్షులు, వివోఏలు సమన్వయంతో కేంద్రాలను సజావుగా నడిపించాలని సూచించారు. రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకురావడానికి ముందు తప్పనిసరిగా శుభ్రపరిచి జల్లిపోసేలా అవగాహన కల్పించాలని చెప్పారు. వ్యవసాయ అధికారులతో సమన్వయం కలిగి కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో డిపిఎం విద్యాసాగర్, ఏపిఎం యాదగిరి, ఎంఎస్ఎంఈ మేనేజర్ శిరీష, అసిస్టెంట్ మేనేజర్ రాజు, సిసిలు నాగరాజు, కుమారస్వామి, మండల సమాఖ్య అధ్యక్షురాలు కవిత, కార్యదర్శి సౌందర్య, గ్రామ సంఘాల అధ్యక్షులు, వివోఏలు, అకౌంటెంట్లు, ఆపరేటర్లు, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ ఆలయంలో సమస్యల జాతర

ఏడుపాయల దుర్గమ్మ ఆలయంలో భక్తులకు ఇబ్బందులు

పాపన్నపేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని నాగ్సాన్ పల్లి శివారులో స్వయంభుగా వెలసిన భక్తుల కోరికలు తీర్చే కొంగుబంగారు తల్లిగా విరాజిల్లుతున్న ఏడుపాయల వన దుర్గమ్మ దేవాలయానికి వచ్చే భక్తులకు ఇక్కట్లు తప్పడం లేదు. భక్తి, విశ్వాసానికి నిలయంగా ఉండాల్సిన ఈ పవిత్ర క్షేత్రం అధికారులు నిర్లక్ష్యం కారణంగా అనేక సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఉచిత దర్శనానికి స్వస్తి పలికి ధర చెల్లించి దర్శనం చేసుకొనే విధంగా ఆలయ అధికారులు తీసుకున్న నిర్ణయాలు భక్తుల ఇబ్బందికరంగా మారింది. ఉచిత దర్శనం సౌకర్యం లేకపోవడం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ప్రతి ఆదివారం ఈ ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. పెద్ద మొత్తంలో భక్తుల నుంచి నిధులు అందుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఆలయాన్ని అభివృద్ధి చేయడం లేదు. 20 రూపాయలు చెల్లిస్తేనేగాని దర్శనం చేసుకునేందుకు వీలు లేకుండా నిర్ణయం తీసుకున్నారు, కనీస స్థాయిలో సౌకర్యాలు కల్పించడం లేదు. తాగేందుకు నీరు అందించకపోవడంతో భక్తులు దప్పికతో ఇబ్బందులు పడుతున్నారు. ఆలయంలో కేవలం ఒక్క చోట మాత్రమే తాగునీటి సౌకర్యం కల్పించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు సేద తీరేందుకు వసతి గృహాలు లేక తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. క్షేత్రంలో భక్తులు మొక్కుల రూపేణ నిర్మించి ఆలయానికి అప్పగించిన వసతి గృహాలే తప్ప దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తుల ఎలాంటి వసతి సౌకర్యాలు కల్పించలేదు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆలయాల్లో భక్తులకు ఉచితంగా ప్రసాదం అందించే ఏర్పాటు చేశారు. అయితే ఇక్కడ మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. అంతేకాకుండా ప్రాంగణం పరిశుభ్రత పూర్తిగా లోపించడంతోపాటు క్షేత్ర వసతి గృహాల వద్ద ఎలుకలు, కోతులు, పందులు సంచరిస్తున్న దృశ్యాలు భక్తులనుకలవరపెడుతున్నాయి. సిబ్బంది అధికారుల నిర్లక్ష్యంతో దేవాలయం పవిత్రత ఎక్కడో మాయమైపోయిందనే భావన కలుగుతోంది. ఏడుపాయల ఆలయ అధికారులు దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాలను అమలు చేయడంలో విఫలమయ్యారని భక్తులు ఆరోపిస్తున్నారు. ఎంతో భక్తి భావంతో వస్తున్న భక్తులకు కనీసం చిటికెడు ప్రసాదం అందక భక్తులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.సిబ్బంది వ్యవహార శైలి, దురుసు ప్రవర్తన, భక్తులను దూషిస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దశాబ్దాలుగా అదే స్థానాల్లో తిష్టవేసి కూర్చున్న కొందరు అధికారులు, సిబ్బంది


ఏడుపాయల వనదుర్గమ్మ

తమ స్వప్రయోజనాలకే పరిమితమయ్యారన్న ఆరోపణలు ఉన్నాయి, ఆలయానికి వస్తున్న ఆదాయం, ఖర్చులకు సంబంధించిన వివరాలు పారదర్శకంగా ప్రకటించాలని భక్తులు కోరుతున్నారు. అదేవిధంగా దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఏడుపాయల దుర్గామాత ఆలయ నిర్వహణ, వసతుల కల్పన తదితర అంశాలపై దృష్టి సారించాలని కోరుతున్నారు. భక్తిశ్రద్ధలతో వస్తున్న భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది.

ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

నీటి ఎద్దడి లేకుండా చర్యలు : సిఇవో

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని జడ్పీ సీఈఓ ఎల్లయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఆయన పెద్దశంకరంపేట మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడి నీటి సమస్యపై అడిగి తెలుసుకున్నారు. గ్రిడ్ నుంచే సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని ఇంట్రా సమస్యలు లేవని దీనిపై గ్రిడ్ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బోరంచ వద్ద నీటి మట్టాలు తగ్గిపోతు సమస్యలు ఏర్పడుతున్నాయని ఇందుకోసం స్థానికంగా ఉన్న బోర్ల ద్వారా ట్యాంకులకు అనుసంధానించి సమస్య లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేకంగా నిధుల మంజూరు లేవని పంచాయతీల నుంచి అవసరమైన నిధులు వాడుకోవాలని తెలిపారు. ఈయనవెంట ఎంపీడీఓ క్రాంతికుమార్, సూపరింటెండెంట్ షాకీర్‌అలీ, కాశీరాం, తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే 5న మహాధర్నా

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:
ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు రెండో పిఆర్‌సి కోసం ఎదురు చూస్తున్నారని ప్రభుత్వం పిఆర్‌సి గడువు పొడిగించకుండా వెంటనే నివేదిక తెప్పించుకొని సంఘాలతో చర్చించి అమలు చేయాలని తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ(టిజిఈజెఎసి) జిల్లా నాయకులు గ్యాదరి పరమేశ్వర్, విక్రంరెడ్డి, తప్పెట్ల యాదగిరి, ఇంద్ర సేనారెడ్డి, తిరుపతిరెడ్డిలు డిమాండ్ చేశారు. తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్‌కమిటీ(టిజిఈజెఎసి) పిలుపులో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టరేట్ ఎదుట టిజిజెఎసి సిద్దిపేట ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 మార్చి నుంచి రిటైరైన 12 వేల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రిటైర్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏక మొత్తంగా రూ.13 వేల కోట్లు కేటాయించి పెండింగ్ బిల్లులు అన్ని క్లీయర్ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ పునరుద్దరించాలన్నారు. ప్రధానమైన నాలుగు సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే మే 5న రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లోని కలెక్ట రేట్‌ల వద్ద మహాధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌కు అందజేశారు.కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నాగరాజు, రంగారావు,తిరుపతిరెడ్డి, కిష్టయ్య, ఖాజా, శశిధర్‌శర్మ, నరేందర్, సుశాంత్, దేవరాజ్, పొన్నమల్ల రాములు, రాజురెడ్డి, జయశ్రీ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి

సిర్గాపూరర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: నల్లవాగు ప్రాజెక్టులో చేపలు పట్టేందుకు వెళ్లి తూములో ఇరుక్కుని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ మహేష్ కథనం ప్రకారం...యాసంగి పంటల కోసం ప్రాజెక్టు కుడి కాలువగుండా సాగునీటి సరఫరాను అధికారులు నిలిపేయడంతో చేపల కోసం చాకలి అశోక్(35) తూములోకి వెళ్లాక ఆక్సిజన్ అందక అశోక్ తూములో ఇరుక్కుని ప్రాణాలు కోల్పోయాడన్నారు. మృతుడు అశోక్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సంఘటన స్థలాన్ని కంగ్టి సిఐ వెంకటరెడ్డి పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చేర్యాల, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని వీరన్నపేట స్టేజీ వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... చేర్యాల పట్టణానికి చెందిన తోడేంగల నర్సింహులు ముదిరాజ్(48) ఆకుకూరలు అమ్ముకుంటూ జీవనం సాగించేవాడు. ఎప్పటిలాగే నర్సింహులు ఆకుకూరలు తీసుకుని చేర్యాల నుండి బచ్చన్నపేట మండలం వీఎస్ఆర్ నగర్‌కు టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తున్న క్రమంలో జనగామ నుండి చేర్యాలకు అతివేగంగా కారు ఎదురుగా వచ్చి టీవీఎస్ ఎక్సల్ బండిని ఢీకొనడంతో నర్సింహులు అక్కడిక్కడే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులకు గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

చోరీలకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ములుగు, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త): మండల పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీ బహిలంపూర్, మామిడ్యాల గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ములుగు ఎస్ఐ రఘుపతి తెలిపారు. బహిలంపూర్ గ్రామానికి చెందిన బొల్లు వెంకటేశం ఇంట్లో రూ.1.50 లక్షల నగదు, మామిడ్యాలకు చెందిన పసుల సత్తయ్య ఇంట్లో 65 వేల నగదు, మూడు తులాల వెండి, సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లగా బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పరిశోధన ప్రారంభించినట్లు తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం ములుగు బస్టాండ్ వద్ద ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం తుర్కపల్లి తండాకు చెందిన అప్పావత్ శ్రీకాంత్ అని, నెల రోజుల క్రితం దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. అతని వద్ద నుండి రూ.50వేల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని, గజ్వేల్ కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. దొంగను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐపి ములుగు మరియు సిబ్బందిని గజ్వేల్ రూరల్ సిఐ డి.రవిరాజు అభినందించారు.



వివరాలు తెలుపుతున్న పోలీసులు

కాంగ్రెస్‌కు మరింత బలాన్ని అందించాలి : బండి రమేష్

బండి రమేష్ ను కల్సి కృతజ్ఞతలు తెలియజేస్తున్న మోహిత్ యూత్ నాయకులు

బేగంపేట ఏప్రిల్ 17,ప్రభాతవార్త

యువతను బలోపేతం చేయాలని,కాంగ్రెస్‌కు మరింత బలాన్ని అందించాలని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ అన్నారు.శుక్రవారం తనను కల్సిన ప్రకాశం నగర్ యువజన కాంగ్రెస్ నూతన కమిటీకి బండి పై విధంగా సూచించారు.ఈ సందర్భంగా ప్రకాశం నగర్ యూత్ డివిజన్ కాంగ్రెస్ నేతలను బండి రమేష్ సన్మానించారు.ప్రకాశం నగర్ యూత్ డివిజన్ అధ్యక్షుడిగా మోహిత్ బీసా,వర్కింగ్ ప్రశిడెంట్‌గా ఎం.డి. యాసిన్,వైస్ ప్రశిడెంట్ గా రాహుల్,ముజమ్మిల్,జనరల్ సెక్రటరీగా నితిన్,సెక్రటరీగా సమీర్‌లను ఎంపిక చేసారు.వీరంతా శుక్రవారం బండి రమేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.ఈ సందర్భంగా డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోహిత్ బీసా మాట్లాడుతూ పెద్దల సూచనలతో డివిజన్‌లో యూత్‌ను బలోపేతం చేస్తానన్నారు.అలాగే ప్రభుత్వ పథకాలను ఇంటింటికి తిరిగి వివరిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు విశాల్‌సుధాం,జయం చంద్రశేఖర్, చిరంజీవి,అరుణ్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ తిప్పలు.. తాళం కప్పలు!

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 17, ప్రభాతవార్తః

యుద్ధం నేపథ్యంలో గ్యాస్ ఇబ్బందులు ప్రత్యక్షంగా, పరోక్షంగా నగరవాసులపై చూపుతున్నాయి. ప్రధానంగా వాణిజ్య సిలండర్ల గురించి చెప్పాల్సిన పనిలేదు. సిలండర్ లభించాలంటే గగనమవుతుంది. బ్లాక్ బార్కెట్‌లోనూ మూడింతల ధర పలుకుతుంది. కొన్ని గ్యాస్ సరఫరా కేంద్రాల వద్ద వినయోగదారులు గ్యాస్ సిలండర్లను ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించిన సంఘటనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే వాణిజ్య గ్యాస్ సరఫరా చేసే ఆటోవాలాలు గ్యాస్ సిండర్లలకు ఇలా తాళం కప్పలు వేసి సిలండర్లను తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. శ్రీనగర్‌కాలనీ ప్రాంతంలో కనిపించిన దృశ్యమిది.

పద్మశాలి మహాసభ సావనీర్ పుస్తకావిష్కరణ



పద్మశాలి మహాసభ సావనీర్ పుస్తకాన్ని ఆవిష్కరించిన దృశ్యం

చిక్కడపల్లి ఏప్రిల్ 17 (ప్రభాతవార్త) :

అఖిల భారత పద్మశాలి మహాసభ ఆధ్వర్యంలో రూపొందించిన సావనీర్ పుస్తకాన్ని సోలాపూర్ మేయర్ వినయ్ కొండ్యాల్‌కు శుక్రవారం మహాసభ రాష్ట్ర నాయకుడు కొక్కుల దేవేందర్ పద్మశాలి నేతృత్వంలో నాయకులు గౌరవప్రదంగా అందజేశారు. కొక్కుల దేవేందర్ పద్మశాలి మాట్లాడుతూ, పద్మశాలి సమాజం అభివృద్ధి, ఐక్యత కోసం ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. సమాజ చరిత్ర, సంప్రదాయాలు, సేవా కార్యక్రమాలను ప్రతిబింబించేలా ఈ సావనీర్ రూపొందించబడిందని పేర్కొన్నారు. మేయర్ వినయ్ కొండ్యాల్ మాట్లాడుతూ, పద్మశాలి సమాజం విద్య, వ్యాపార రంగాలలో ముందంజలో నిలుస్తోందని ప్రశంసించారు. సమాజ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు పద్మశాలి సంఘ నాయకులు, సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా జరిగింది

పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి గ్యాస్ ధరలను తగ్గించాలి



డిలిమిటేషన్ పత్రులను దగ్ధం చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

సైఫాబాద్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి గ్యాస్ ధరలను జిఎస్టీ పరిధిలోకి తీసుకురావడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందని ఆరోపిస్తూ ఆనేక మంది ఆటో డ్రైవర్లు శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని వై జంక్షన్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోకుండా డిలిమిటేషన్‌పై చూపిస్తున్న శ్రద్దను వ్యతిరేకిస్తూ వారు డిలిమిటేషన్ ప్రతులను దగ్ధం చేశారు. తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ నాయకుడు వి.ఎస్.బోస్, ఆటో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం మాట్లాడుతూ పెట్రోల్, డీజీల్, ఎల్‌పిజి గ్యాస్ ధరలను ప్రభుత్వం జిఎస్టీ పరిధిలోకి తీసుకురాకపోవడంతో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని చెప్పారు. జిఎస్టీ పరిధిలోకి తీసుకువస్తే ధరలు తగ్గిస్తే జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. ఈ విషయాన్ని కేంద్రం పక్కన పెట్టి దక్షిణ భారతదేశ ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న డి లిమిలేటన్ తీసుకురావడం వల్ల కేంద్ర ప్రభుత్వానికి ఉపయోగమే గాని ప్రజలకు ఏలాంటి ప్రయోజనం చేకూరదన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కారించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు యాదగిరి, జంగయ్య, అశోక్, నర్సింహ్మా, కృష్ణ పాల్గొన్నారు.

అన్నిదానాల్లోకెళ్లా అన్నదానం గొప్పది : బండారు వరప్రసాద్

కుత్బుల్లాపూర్, ఏప్రిల్17 ప్రభాతవార్త : అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని అన్నపూర్ణ సేవాసమితి చింతల్ కుత్బుల్లాపూర్ నిర్వాహాకులు బండారు వరప్రసాద్ గుప్తా అన్నారు. చింతల్ రంగానగర్ ప్రధాన రహదారిపై అమావాస్య సందర్భంగా ఉచిత అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా బండారు వరప్రసాద్ గుప్తా మాట్లాడుతూ అన్నపూర్ణ సేవాసమితి నిర్వాహాకులు అన్నదానంతో ప్రసిద్దిగా నిలుస్తున్నారని కొనియాడారు. గతకొన్ని నెలలుగా నిస్వార్థహృదయంతో అన్నదానాన్ని నిర్వహించి ప్రత్యేకత చాటుకుంటున్న అన్నపూర్ణాసేవాసమితి నిర్వాహకులను అభినందించారు. ఇలాంటి అన్నదానాలు నిరంతరం కొనసాగేలా ఒక నిర్దుష్ట విధానంద్వారా ముందుకు వెళ్లాని సూచించారు.కార్యక్రమంలో ఉమాశంకర్, రంగయ్య, సంతోశ్‌కుమార్, నక్కా ప్రకాశ్, గౌరయ్య, రాజయ్య,పున్నారెడ్డి,రూప్‌చంద్,లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత విద్య,వైద్యం అందించాలి : వేముల రామకృష్ణ

హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న 33 శాతం మహిళా రిజర్వేషన్లు సరే..కేంద్ర రాష్ట్ర మంత్రి వర్గంలో33 శాతం మహిళలకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని తెలంగాణ విద్యార్థి జెఏసి చైర్మన్ వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యార్థి జెఏసి ప్రతినిధులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ..మహిళలకు ఉచిత నిర్బంద విద్య కల్పించి, వారికి 33 శాతం చొప్పున ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. రాజకీయ లబ్ధి కోసం మహిళా బిల్లు కాకుండా.. చిత్తశుద్ధి ఉంటే అన్ని రంగాల్లో 33 శాతం ఇవ్వాలని, అలాగే మహిళా బిల్లులో సబ్ కోట ఏదని ఆయన ప్రశ్నించారు.'బేటి పడావో బేటి బచావో అంటున్నారు. ఒక పూరి గురుసలు పుట్టిన భేటీ ఉన్నత విద్య చదువుకోలేక పోతుంది. చదువుకునే వయసులో ఫీజుల కోసం పార్ట్ టైం జాబులు, క్యాటరింగ్ పనులు చేస్తున్నారు.అందుకే స్త్రీలకు ఉచిత విద్య,వైద్యం అందించాలి' అని వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు.జెఏసి నేతలు మహేశ్వరి, దివ్య, జ్యోతి, గాయత్రి, లావణ్య, హారిక, ప్రణీత, శ్రీవర్షిని పాల్గొన్నారు,

పార్లమెంట్ చర్చకు ఆహ్వానించడం నాట్య కళాకారిణిగా సంతోషంగా ఉంది : డాక్టర్ పద్మజారెడ్డి

చిక్కడపల్లి ఏప్రిల్ 17 (ప్రభాతవార్త) : రాజకీయ రంగంలోనూ మహిళలకు సమాన అవకాశాలు లభించిన కీలక ఘట్టంలో తనను ప్రత్యక్షంగా పార్లమెంట్ చర్చకు ఆహ్వానించడం నాట్య కళాకారిణిగా చాలా సంతోషంగా ఉందని పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రముఖ కూచిపూడి నాట్య గురు డాక్టర్ పద్మజారెడ్డి అన్నారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ లో భాగంగా లోక్ సభలో రాజ్యాంగ సవరణ మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టడం శుభపరిణామం అని అన్నారు. లోక్ సభలో జరిగే చర్చ, శుక్రవారం ఓటింగ్ తో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందే ఘట్టం తిలకించారు. ఈ సందర్భంగా కేంద్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ దేశ వ్యాప్తంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన మహిళలను కొంతమందిని పార్లమెంట్ గ్యాలరీ లో కూర్చుని ఈ కీలక బిల్లు ఆమోదం పొందే ఘట్టానికి ప్రత్యక్షంగా ఆహ్వానించింది. తెలంగాణ నుంచి డాక్టర్ పద్మజారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఢిల్లీ నుంచి పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ అపూర్వ ఘట్టంలో తాను భాగస్వామి కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. దేశ చరిత్రలో ఇది కీలక ఘట్టం అని, సువర్ణ అక్షరాలతో లిఖించే మహిళా విజయం అని ఆమె అభివర్ణించారు. పంచాయితీల నుంచి పార్లమెంట్ వరకు మహిళలకు పెద్ద ఎత్తున రాజకీయ అవకాశాలు రావడం ఆహ్వానించదగిన పరిణామం అని ప్రధాని నరేంద్ర మోదీకి, బిల్లును ఆమోదించనున్న ప్రతి ఒక్కరికి పద్మజా రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. 29 ఏళ్లుగా మహిళా రిజర్వేషన్ బిల్లు పెండింగ్ లో ఉందని, ఇన్నాళ్లకు వికసిత్ భారత్ రూపంలో చట్ట బద్ధత లభించనున్నదని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. మహిళలు నిర్ణయాత్మక శక్తిగా మారితే దేశానికి గొప్ప మార్గ నిర్దేశకత్వం వహిస్తారని ఆమె అన్నారు. మహిళా బిల్లు ఆమోదం అంటే పూర్తిగా జనహితం అని, ఇది పురుషులు కూడా ఆనందించాల్సిన అపూర్వ శుభదినం అని పద్మజా రెడ్డి సంతోషం వెలిబుచ్చారు.

ఉద్యోగుల ఏడు డిమాండ్లకు పరిష్కారం చూపిన జలమండలి

జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న జలమండలి ఎండి కె.అశోక్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త

ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి ప్రతినిధి బృందం విజ్ఞప్తి మేరకు పది డిమాండ్‌లలో ఏడు డిమాండ్‌ల పరిష్కరానికి జలమండలి ఎండి కె.అశోక్‌రెడ్డి ప్రొసీడింగ్స్ జారీ చేశారు. శుక్రవారం జలమండలి కార్యాలయంలో మొగుళ్ళ రాజి రెడ్డి ప్రతినిధి బృందనికి ఆయన ప్రొసీడింగ్స్ అందజేశారు. జి.పి.ఏ,పిపి చేంజ్ యువర్ బ్రాంచ్ సమస్య పరిష్కరానికి రెండు రోజుల్లో ప్రొసీడింగ్ ఇస్తామని, మిగితా డిమాండ్‌లు ఎన్.పి.ఎస్ గ్రాజుటీ,క్యూ.ఏ.టి జె.టి.ఓ అప్డేట్ ప్రమోషన్ల వచ్చేవారం జరిగే బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ మీటింగ్‌లో మూడు అంశాలు పెట్టి వీటికి సంబంధించిన ప్రొసీడింగ్లు ఇస్తామని కె.అశోక్ రెడ్డి హామీ ఇచ్చినట్లు మొగుళ్ళ రాజిరెడ్డి తెలిపారు. జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసిన మొత్తం 10 డిమాండ్‌లలో సరెండర్ లీవ్ ఎన్కాష్మెంట్, ఉద్యోగులకు బోర్డు వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రకటించిన క్యాష్ ఇన్సెంటివ్, యూనిఫామ్ డ్రెస్, ఓటీ కంపెన్సషన్, జనరల్ ట్రాన్స్ఫర్ సెక్షన్ టు సెక్షన్ ఇబ్బంది కాకుండా ట్రాన్స్ఫర్, సీనియర్ అసిస్టెంట్ పిఏఎఫ్ ఏ టూ ఆఫీసర్ ప్రమోషన్స్, ఇన్ ఆపరేటివ్ పాన్, ఆధార్ వల్ల మూడు కోట్ల పైచిలుకు చిన్న స్థాయి ఉద్యోగులపై భారం పడకుండా మాఫీ వంటి ఏడు సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. మిగితా పెండింగ్ లోఉన్న మూడు డిమాండ్‌లు సాధ్యమైనంత త్వరలో పరిష్కారానికి జలమండలి ఎండి కె.అశోక్ రెడ్డి హామీ ఇచ్చారని చెప్పారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి ,జలమండలి ఎండి అశోక్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్మికుల సమస్యలు మొత్తం పరిష్కరించే దిశగా పోరాడుతున్నామని, వచ్చే జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని రాజిరెడ్డి విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ రాజ్,నాయకులు బి.శంక ర్ ప్రకాష్, శ్రీనివాస్‌యాదవ్, గౌస్ పాషా, సిహెచ్. ప్రవీణ్ కుమార్, బి. రామకృష్ణ, జి. శ్రీకాంత్, చెన్నయ్య, బి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి : సాయిప్రసాద్ గౌడ్

వైద్య పరీక్షలు జరుపుతున్న వైద్యులు

సికింద్రాబాద్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:

బౌద్ధనగర్ డివిజన్ అంబర్‌నగర్ శకుంతల స్కూల్ వద్ద అంబనగర్ బస్తీకమిటీ అధ్యక్షులు నాగరాజు, నాని, ప్రమోద్‌ల ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో స్థానికులు ఉచిత వైద్య పరీక్షలు జరిపించుకున్నారు. రోగులకు అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీజేపీ బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు సాయిప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, ఇలాంటి ఉచిత వైద్య శిబిరాల వద్ద అవసరమైన పరీక్షలు జరిపించుకోవడం వల్ల ఆరోగ్య పరంగా నష్టపోకుండా ఉంటామన్నారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఇలాంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని అన్నారు.

టిఎన్‌జిఓ ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను అమలు చేయాలి : జెఏసి

మాట్లాడుతున్న కేంద్ర టిఎన్‌జిఓ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ ఈచిత్రంలో తదితరులు

గన్‌ఫౌండ్రి,ఏప్రిల్ 17ప్రభాతవార్త:

తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటి పిలుపు మేరకుశుక్రవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో భోజన విరామ సమయంలోనిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసంహైదరాబాద్ జిల్లాలోని వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన వందలాది ఉద్యోగులు, ఉపాధ్యాయులు కార్మికులు,గజిటెడ్ అధికారులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వానికి తమ నిరసన గళాన్ని వినిపించారు.ఈసందర్భంగా తెలంగాణ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్.ఎస్. ఎం. ముజీబ్‌హుస్సేనీ మాట్లాడుతూ ఉద్యోగులకు హెల్త్‌కార్డులు,నగదు రహిత చికిత్స,అందేలా పటిష్టమైనచ ,హెల్త్ కార్డుల విధానాన్ని అమలు చేయాలని, జూన్2వ తేది 2026లోపు నూతన పిఆర్‌సి వెంటనే అమలు చేయాలని,పెండింగ్ బిల్లుల ఉద్యోగులకు రావాల్సిన అన్నిరకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.సిపిఎస్‌విధానాన్ని రద్దుచేసి,పాతపెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలన్నారు.ఈకార్యక్రమంలో టిఎన్‌జిఓ రాష్ట్ర,నగర నాయకులు శ్రీనివాస్‌రావు, బి.శ్యామ్, చావరవి,రత్నాకర్‌రావు, కృష్ణయాదవ్, విక్రమ్ కుమార్,కె.ఆర్.రాజ్‌కుమార్, వి.అశోక్,ఎం.వి. రమణ, సురేందర్‌రెడ్డి,రాజశ్వరరెడ్డి,గీతాసింగ్,ముకీమ్‌ఖురేషీ,బాల్‌రాజ్ వందలాది మంది ఉద్యోగులు,జాయింట్ యాక్షన్ కమిటి ప్రతినిధులు పాల్గొన్నారు.

దోమల నివారణపై ప్రత్యేక అవగాహన

పేట్ బషీరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త

వేనెల్లగడ్డ కాలనీలో దోమల నివారణపై శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. జీహెచ్ఎంసి ఎంటమాలజిస్ట్ అధికారి కాసిఫ్ తమ సిబ్బందితో కలిసి కాలనీలో పర్యటిస్తూ దోమల పెరుగుదలను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, చెత్తను సక్రమంగా నిర్వహించడం, మస్కిటో నెట్స్, రిపెలెంట్స్ వినియోగించడం వంటి సూచనలు చేశారు. ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని నియంత్రించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో కుంట సిద్దిరాములు, బచ్చ జ్ఞానేశ్వర్, బాలమల్లేష్, లక్ష్మణ్, కాలనీ పెద్దలు, స్థానిక నివాసితులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రకటించిన జనాభా లెక్కలు అసత్యం

సమావేశంలో మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

సైఫాబాద్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జనాభా లెక్కలు పూర్తిగా బోగస్ అని, అసత్యమని దళిత బహుజన పార్టీ ఆరోపించింది. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్‌విభజన బిల్లు సందర్భంగా తెలంగాణలో జనాభ లెక్కలు అంటూ 2011 జనాభా లెక్కలను రాష్ట్ర ప్రభుత్వం అధికార పూర్వకంగా ప్రకటించడం అత్యంత దారుణం, సిగ్గుచేటని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ విమర్శించారు. శుక్రవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ఎస్సీ కులాల్లోని మాల, మాదిగ కులాలకు చెందిన జనాభా లెక్కలు తప్పుడు సమాచారమన్నారు. 2027లోనే దేశవ్యాప్తంగా జనాభా లెక్కల సేకరణ తరువాతనే నియోజకవర్గాల పునర్‌విభజన చేపట్టాలని ఆయన కే ంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా బిల్లులో 33 శాతం రాజకీయ అవకాశాల కల్పన చట్టంలో ఎస్సీ, ఎస్టీ, బిసి మహిళలకు సబ్‌కోటా కేటాయించిన తరువాతే మహిళలకు రిజర్వేషన్‌ల చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్సీ,ఎస్టీ,బిసి మహిళలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. రేవంత్‌రెడ్డికి దమ్ముంటే 2027లో దేశవ్యాప్తంగా జనాభా లెక్కలు కులాలు, మతాలు వారిగా ఎస్సీ, ఎస్టీ, బిసి ఉప కులాల జనాభాను కూడా సేకరించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఫలక్‌నుమా డిపోలో ఘనంగా మహనీయుల జయంతి

విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న డిపో మేనేజర్ రమేష్

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : మహనీయులను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు భవిష్యత్‌లో రాణించాలని ఫలక్‌నుమా డిపో మేనేజర్ ఎన్.రమేష్ తెలిపారు. ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫలక్‌నుమా డిపో ఆవరణల మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ రమేష్ మాట్లాడుతూ మహనీయులు చూపిన బాట నేటి యువతరానికి స్పూర్తిదాయకమన్నారు. ముఖ్యంగా విద్యార్థి దశ నుండే మహనీయుల జీవిత విశేషాలను నేర్పించి వారిని సరియైన మార్గంలో నడిపించాలన్నారు. అనంతరం వివిధ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు గడ్డం శ్రీనివాస్, పి.సుభాష్, ఎం.సుధాకర్‌రావు, రఘుపతి, విఠల్, విజయ్, అసిస్టెంట్ మేనేజర్ రాజయ్య పాల్గొన్నారు.

ఇంటాచ్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగా వేదకుమార్ ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న వేదకుమార్, అశోక్‌సింగ్ ఠాకూర్, రవీంద్రసింగ్

సైఫాబాద్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఐఎన్‌టిసిహెచ్) మూడు సంవత్సరాల (2026 నుంచి 2029) కాలానికి జాతీయ కౌన్సిల్ సభ్యుడుగా ఉన్న ఇంజనీర్ మణికొండ వేదకుమార్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైనారు. ఈ మేరకు ఢిల్లీలోని ఐఎన్‌టిసిహెచ్‌లో జరిగిన ఒక సమావేశంలో ఆయనకు ఈ అదనపు బాధ్యతలను ఆ సంస్థ అప్పగించింది. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టిసిహెచ్ ఛైర్మన్ అశోక్‌సింగ్‌ఠాకూర్, సభ్య కార్యదర్శి రవీంద్రసింగ్ సమక్షంలో ఈ విషయాన్ని ప్రకటించారు. వేదకుమార్ నాయకత్వం, అనుభవం, వారసత్వ పరిరక్షణపై ఆయన అంకితా భావానికి గుర్తింపుగానే ఈ అవకాశం లభించిందని ఛైర్మన్ తెలిపారు. దక్షిణ భారతదేశం నుంచి జాతీయ కార్యవర్గానికి ఎంపికైన కొద్ది మందిలో ఆయన ఒకరన్నారు. ఇది దక్షిణ భారతదేశానికి గొప్ప గర్వకారణమన్నారు. సాంస్కృతి, వారసత్వ పరిరక్షణ, విద్యారంగాల్లో వేదకుమార్ చేసిన సేవలతో ఇంటాచ్ కార్యక్రమాలు మరింతగా బలోపేతం అవుతాయన్న అశాభావాన్ని ఛైర్మన్ వ్యక్తం చేశారు.

నాటక రచయిత వల్లూరి శివప్రసాద్‌కు వాసిరెడ్డి సీతాదేవి జాతీయ పురస్కార ప్రదానం

ప్రముఖ నాటక రచయిత వల్లూరి శివప్రసాద్‌కు ఖివాసిరెడ్డి సీతాదేవిఖి జాతీయ పురస్కార ప్రదానం చేసిన దృశ్యం

చిక్కడపల్లి ఏప్రిల్ 17 (ప్రభాతవార్త) : అభ్యుదయ భావజాలంతో, సామాజిక స్పృహతో వాసిరెడ్డి సీతాదేవి సృష్టించిన సాహిత్యం ఎప్పటికీ సజీవంగా ఉంటుందని, అటువంటి గొప్ప రచయిత్రి పేరిట పురస్కారం అందుకోవడం శివప్రసాద్ నిరంతర కృషికి దక్కిన గౌరవం అని రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికలో తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వంశీ కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ , లేఖిని రచయిత్రుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వాహక సంస్థ అధినేత డాక్టర్ వంశీ రామరాజు నిర్వహణలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం అధ్యక్షతన ప్రముఖ నాటక రచయిత వల్లూరి శివప్రసాద్‌కి డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి వంశీ రంగస్థల జాతీయ పురస్కారం 2026 ను ముఖ్యఅతిధిగా హాజరైన డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి చేతులమీదుగా అందించి ప్రసంగించారు. నాటక రంగానికి వల్లూరి శివప్రసాద్ చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. సభాధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం, సీతాదేవి సాహితీ విలువలను, శివప్రసాద్ రచనా శైలిని విశ్లేషించారు. దూరదర్శన్ డైరెక్టర్ కామేశ్వరి, ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు పాల్గొని ప్రసంగించారు. వంశీ సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ వంశీ రామరాజు, లేఖిని అధ్యక్షురాలు శ్రీమతి అత్తలూరి విజయలక్ష్మి, వంశీ మేనేజింగ్ ట్రస్టీ శైలజ సుంకరపల్లి తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి రచనలపై ప్రత్యేక పరిశీలన కార్యక్రమం జరిగింది. సర్వమంగళ గౌరి, నండూరి సుందరీ నాగమణ, మణి వడ్లమాని, కుసుమ ఉప్పలపాటి, సరస్వతి కరవది తదితర రచయిత్రులు సీతాదేవి వివిధ నవలలు, కథాంశాలపై ప్రసంగించారు.

పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలి

ముషీరాబాద్ ఎమ్మార్వోకు వినతిపత్రం అందచేస్తున్న టీజీఈ జేఏసీ ముషీరాబాద్ మండల కమిటీ నేతలు

ముషీరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టిజీఈ జేఏసీ ముషీరాబాద్ మండలం కమిటీ నేతలు విజ్ఞప్తి చేశారు. టీజీఈ జేఏసీ తలపెట్టిన దశలవారీ కార్యక్రమంలో భాగంగా వారు శుక్రవారం ముషీరాబాద్ తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 2వ తేదీ నాటికి పీఆర్సీ అమలుపరచాలని, రిటైరైన ఉద్యోగులకు పెండింగ్ బిల్స్ అన్నీ క్లియర్ చేయాలని కోరారు. హెల్త్ కార్డ్స్ తక్షణమే అమలుచేయాలని, సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్ విధానంను పునరుద్ధరించాలని, 2004 సెప్టెంబర్ 1వ తేదీకి ముందు నియామకమైన ఉద్యోగులకు ఓపీఎస్ అమలుచేయాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్ బిల్లులతో పాటు పెండింగ్ డిఏలను విడుదల చేయాలని, ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ ప్రకారం 61 సంవత్సరాలు నిండిన వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటుచేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించిన సాధారణ బదిలీలు చేపట్టాలని, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీఈ జేఏసీ ముషీరాబాద్ మండల కమిటీ సభ్యులు ఏ.చందన, పి.జ్యోతి, ఈ.నిరంజన్ గౌడ్, అనిల్‌కుమార్, పి.కృష్ణయ్య, బి.రమేష్, డి.సాయిశరత్, శివ సత్య ప్రసాద్, సునీత, భార్గవి, జిపీఓల రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేంద్రరావు, జిపీఓలు యాదగిరి, పి.విజయ్‌కుమార్, అస్ర ముబీన్ తదితరులు పాల్గొన్నారు.

విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం లేదు

-హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ

పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ

చిక్కడపల్లి ఏప్రిల్ 17 (ప్రభాతవార్త) : నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని, దేశాభివృద్ధిని కాంక్షించి ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియకు సహకరించాలని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. శుక్రవారం అడిక్ మెట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పాశం సాయికృష్ణ యాదవ్ అధ్యక్షతన పార్లమెంట్ లో మహిళా బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా నిర్వహించిన సమావేశానికి దత్తాత్రేయ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతోందని కొనియాడారు. మహిళా సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఖిమహిళా బిల్లుకు రాజకీయాలకు అతీతంగా మద్దతు తెలపాలని కోరారు. జనాభాలో సగభాగంగా ఉన్న మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని, ఓటింగ్ సమయంలో పార్టీలన్నీ ఏకతాటిపైకి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు పాశం సాయికృష్ణ యాదవ్, పాశం శైలజ యాదవ్, సుజాత, మాధవి, సుశీల, దర్గా నర్సింగరావు, శివ, కౌండిన్య ప్రసాద్, కిషోర్, విన్ను ముదిరాజ్, రాజకుమార్, చంద్రశేఖర్, వర్మ పాల్గొన్నారు.

గాజులరామారం సర్కిల్‌లో ఆకస్మిక తనిఖీలు

ఆకస్మిక తనిఖీ చేస్తున్న డిప్యూటీ కమిషనర్ శ్రీపాద రామేశ్వర్

జీడిమెట్ల, ఏప్రిల్ 17, ప్రభాతవార్త

గాజులరామారం సర్కిల్‌లో డిప్యూటీ కమిషనర్ శ్రీపాద రామేశ్వర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేటరింగ్ సర్వీసులు నిర్వహిస్తున్న ప్రాంతాలను పరిశీలించగా, ఆహార తయారీ, సరఫరా ప్రాంతాల్లో అపరిశుభ్రమైన, అనారోగ్యకర పరిస్థితులు ఉన్నట్లు గుర్తించారు.ప్రజా ఆరోగ్యానికి ముప్పు కలిగించే పరిస్థితులు ఉన్నందున సంబంధిత కేటరింగ్ సర్వీసులను ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పవన్ కుమార్ ఆధ్వర్యంలో తక్షణమే సీజ్ చేశారు. ఆహార భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంపై సంబంధిత నిర్వాహకులకు నోటీసులు జారీ చేయడంతో పాటు జరిమానాలు విధించనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ శ్రీపాద రామేశ్వర్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యంతో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సి.ఎం.సి అధికారులు, ఏఈ స్వాతి, ఎఫ్ఎస్ఓ పవన్ కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలను పూడ్చిన ట్రాఫిక్ పోలీసులు

బేగంపేట ఏప్రిల్ 17,ప్రభాతవార్త



బేగంపేట పరిధిలో రోడ్డు పక్కన ఏర్పడిన గుంతలను పూడుస్తున్న ట్రాఫిక్ ఏఎస్సై శ్యామల.

బేగంపేట పరిధిలో రోడ్ల మార్జిన్లలో ఏర్పడిన గుంతలను ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం పూడ్చారు .బేగంపేట పరిధిలో కొన్ని ప్రాంతాల్లో రోడ్డు మార్జిన్లలో భారీ సైజులో గుంతలు ఏర్పడ్డాయి.దీంతో వాహనదారులు రోడ్డు దిగి ఎక్కే క్రమంలో పడిపోతున్నారు.ఇది గమనించిన ట్రాఫిక్ ఏఎస్సై శ్యామల సిబ్బంది సహకారంతో శుక్రవారం కొన్ని ప్రాంతాల్లో ఉన్న గుంతలను డస్ట్‌తో పూడ్చారు.దీంతో వాహనదారులకు కొంత ఉపశమనం కలిగింది.ఈ సందర్భంగా వాహన దారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణించాలని,మితిమీరిన వేగంతో ప్రయాణించి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని, హెల్మె ట్, సీటుబెల్ట్ ధరించాలని ఏఎస్సై వాహనదారులకు సూచించారు.

అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్ల పంపిణీ

మూసాపేట్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం, పోషణ అభియాన్‌లో భాగంగా శుక్రవారం వివేకానంద నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆల్విన్ సర్కిల్ పరిధిలోని వివిధ డివిజన్లకు చెందిన 26 మంది అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని, సీడీపీఓ రేణుక, మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావులతో కలిసి మొబైల్ ఫోన్లను అందజేశారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారికి అందించిన ఈ మొబైల్ ఫోన్లు సమాచార మార్పిడి, ప్రభుత్వ మార్గదర్శకాల అమలు, రోజువారీ కార్యకలాపాల నిర్వహణలో ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. పాఠ్యపుస్తకాలు అందించడంతో పాటు మధ్యాహ్న భోజన పథకం ద్వారా సమయానికి పౌష్టికాహారం అందించాల్సిన బాధ్యత టీచర్లదేనని సూచించారు. అర్హులైన దివ్యాంగులకు స్కూటీలు అందజేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి, మారేళ్ల శ్రీనివాస్, బ్రిక్ శ్రీనివాస్, ఎండీ ఇబ్రహీం, గుమ్మడి శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపటం ప్రాణాలకే ముప్పు

గాంధీనగర్ ట్రాఫిక్ సీఐ వెంకటరెడ్డి

ముషీరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: మద్యం సేవించి వాహనాలు నడపటం వల్ల ప్రమాదాల బారిన పడి, ప్రాణాలకే ముప్పు ఏర్పడవచ్చునని గాంధీనగర్ ట్రాఫిక్ సీఐ డి.వెంకటరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 14మంది నిందితులను నాంపల్లి మనోరంజన్ కాంప్లెక్స్‌లోని 10వ జుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు ప్రొడ్యూస్ చేసినట్లు తెలిపారు. వారిలో ముగ్గురు వ్యక్తులు రవి (50), సుమన్ (25), శివకుమార్(31) డ్రంకెన్ డ్రైవ్‌లో మూడవసారి పట్టుబడటంతో వారికి 3రోజుల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి 10,100 రూపాయల చొప్పున పెనాల్టీ విధించినట్లు సీఐ వివరించారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ సురక్షితంగా ఉండాలని సూచించారు.

జూబ్లీహిల్స్‌లో ఫేక్ నంబర్‌ప్లేటుతో చిక్కిన వాహనదారుడు

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 17, ప్రభాతవార్తః

జూబ్లీహిల్స్‌లో నంబర్ ఫిక్సింగ్ వ్యవహారాన్ని మరిచిపోకముందే మరో వాహనదారుడు నకిలీ నంబరు ప్లేటుతో ప్రయాణిస్తూ ట్రాఫిక్ పోలీసులకు చిక్కాడు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఎస్సై నరసింహారావు రోడ్ నంబరు 54లోని వరలక్ష్మి కూడలిలో విధులు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో అటుగా వచ్చిన హోండా యాక్టివా వాహనం ఏపీ 39 కేజీ 7219 నంబరు గల వాహనదారుడు అనుమానస్పదంగా కనిపించడంతో ఆపి విచారించారు. వాహన పత్రాలు సమర్పించాలని సూచించారు. వాహన ఇంజిన్, ఛాసిస్ నంబర్లను తనిఖీ చేసిన ట్రాఫిక్ ఎస్సై వాహనానికి ఫేక్ నంబరు ప్లేటు ఉన్నట్లు గుర్తించారు. చలానాల నుంచి తప్పించుకొనేందుకు వాహనానికి తప్పుడు నంబరు ప్లేటును ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. నెల్లూరు జిల్లాకు చెందిన మధురానగర్ ప్రాంతంలో నివసించే వాహనదారుడైన వడ్లమూడి సురేష్(25)పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపులకు మహిళ ఆత్మహత్య

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 17, ప్రభాతవార్తః

బంధువు వేధింపులతో ఒక మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ ప్రవంతి నగర్‌లో తన సోదరుడితో కలిసి లక్ష్మి అనే మహిళ నివసిస్తుంది. భర్తకు దూరంగా పిల్లలతో కలిసి ఉంటున్న ఆమెను ఆమె ఆడపడుచు భర్త సంజీవ తరుచుగా వేధించేవాడు. ఆమె వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా మాట్లాడేవాడు. దీంతో ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనపై ఆమె సోదరుడు విష్ణు ఫిర్యాదు చేయగా పోలీసులు సంజీవపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డిఆర్‌డిఏ పిడి జయదేవ్‌ఆర్య

కూలీల సంఖ్యను పెంచాలి : డిఆర్‌డిఏ పిడి

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త): ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో ఉపాధి పనులు చేపడుతున్న స్థలాల వద్ద కూలీలకు నీడ, తాగునీరు కల్పించాలని సిద్దిపేట జిల్లా డిఆర్‌డిఏ పిడి జయదేవ్‌ఆర్య అన్నారు. శుక్రవారం తీగుల్ గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో కూలీలు ఉదయాన్నే పనుల్లోకి వచ్చేలా చూడాలని, తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు పొలాలకు వెళ్లేందుకు బాటలు వేసుకోవచ్చని, చెరువుల్లో పూడికతీత ద్వారా తీసిన మట్టిని పొలాలకు తరలించుకోవచ్చని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. అంతకుముందు ఎంపిడివో కార్యాలయాన్ని సందర్శించి ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడివో పి.వేణు గోపాల్‌రెడ్డి, ఎంపివో ఖాజా మొయినొద్దీన్, తీగుల్ సర్పంచ్ కుడుదుల రజిత పరశురాం, ఉపాధిహామీ ఏపివో సుధాకర్, టెక్నికల్ అసిస్టెంట్ సంతోష్, ఫీల్డ్ అసిస్టెంట్ పార్వతి, పంచాయతీ కార్యదర్శి నరేందర్ పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన సదస్సు

అవగాహన కల్పిస్తున్న ఏసిపి సదానందం

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : రోడ్డు ప్రమాదం జరిగిన మొదటి గంట (గోల్డెన్ అవర్) అత్యంత కీలకమని, ఆ సమయంలో అందించే సరైన ప్రథమ చికిత్స మనిషి ప్రాణాన్ని నిలబెడుతుందని ఏసీపీ సదానందం పేర్కొన్నారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు, ఆటో,అంబులెన్స్ డ్రైవర్లు, వలంటీర్లకు ప్రథమచికిత్స పై హుస్నాబాద్ లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ సదానందం మాట్లాడుతూ ప్రమాదం జరిగిన మొదటి 60 నిమిషాల్లో బాధితుడికి సరైన వైద్య సాయం అందితే ప్రాణాపాయం నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రమాదం జరిగినప్పుడు వెంటనే 108కి కాల్ చేసి బాధితులను ఆసుపత్రికి తరలించాలని, అంబులెన్సు వచ్చేలోగ ప్రథమచికిత్స అందించాలని, అంబులెన్సు డ్రైవర్స్‌కి కూడా ప్రాథమిక వైద్య మెళకువలు తెలిసి ఉండాలన్నారు. రక్తస్రావాన్ని అరికట్టడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే సిపిఆర్ చేయడం వంటి అంశాలపై డ్రైవర్లకు, వాలంటీర్లకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించే వాలంటీర్లు బాధితులకు భరోసా కల్పిస్తూ, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అంబులెన్స్ సకాలంలో చేరుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమం లో హుస్నాబాద్ సిఐ కొండ్ర శ్రీనివాస్, ఎస్ఐ లక్ష్మారెడ్డితో పాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

పందుల బెడద నుంచి కాపాడండి



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

బెజ్జంకి, ఏప్రిల్ 17,ప్రభాతవార్త : మండల కేంద్రంలో పందుల బెడద నుంచి కాపాడాలని ప్రజలు శుక్రవారం తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపిడివో ప్రవీణ్, ఎస్ఐ బోయిని సౌజన్య, సర్పంచ్ బొల్లం శ్రీధర్ పెద్దన్నకు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో పందులను విచ్చలవిడిగా విడిచి పెట్టడంతో ఇళ్లలోకి ప్రవేశించి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. పందులు వెదజల్లే దుర్వాసనతో అనారోగ్యాల పాలవుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పందుల పెంపకం దారులపై వెంటనే చర్యలు తీసుకొని పంట పొలాలను, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దుమాల మహేష్, వార్డు సభ్యులు తిప్పారపు మహేష్, సతీష్, శివకృష్ణ, ప్రజలు పాల్గొన్నారు.

మహంకాళి దేవాలయంలో ప్రత్యేక పూజలు

గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త): పట్టణంలోని మహంకాళి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు నందబాలశర్మ మాట్లాడుతూ మహంకాళి అమ్మవారి ఆలయం దాతల సహకారంతో సర్వాంగ సుందరంగా నిర్మితమవుతుందని, అందులో భాగంగా ఇటీవల రాజశ్యామల దేవి, కాల భైరవ, రాహు కేతువుల ప్రతిష్ట నిర్వహించి 40 రోజులు పూర్తయిన సందర్భంగా మండల పూజా కార్యక్రమాలు, అభిషేకాలు, హోమం నిర్వహించడం జరిగిందన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాల్వ శ్రీధర్, కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, నేతి సంతోష్, కైలాస ప్రభాకర్, నాగరాజు, ప్రేమ్‌కుమార్, అత్తెల్లి నాగేంద్రం, రాజేశం, సంతోష్, నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ఉద్యోగుల నిరసన



ఆసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

గజ్వేల్, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త): ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్ చారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రి వద్ద మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఒకరోజు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు రెండో వేతన సవరణ అమలు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఫార్మసీ అధికారి విమల, నర్సింగ్ సూపరింటెండెంట్ సువర్ణ, జగదాంబ, వకులాదేవి, నిర్మల, ఉమా మహేశ్వరి, ఫార్మసీ అధికారి మోహన్, బండారి స్వర్ణలత, శిరీష, రమాదేవి, షాహిని, రష్మి, శోభ, రాజు, గౌతమి, విమలదేవి, నిర్మల, లక్ష్మి, పుష్ప, ఉమా, రోజాలిన్, హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్, టెక్నీషియన్ రాజు, సురేందర్, సంతోష్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సార్ మ్యాపింగ్‌పై బిఎల్‌ఓలకు శిక్షణ

చౌటకూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: తహసీల్దార్ కార్యాలయంలో బిఎల్‌ఓలకు ఎస్సార్ మ్యాపింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎస్సార్‌కు మ్యాచింగ్ అయిన వారి కుటుంబ సభ్యులు, ముఖ్యంగా కొడుకులు, కూతుళ్లు, మనవళ్లు తదితర కుటుంబ సభ్యుల వివరాలను మ్యాపింగ్‌లో నమోదు చేయాలని గోపికృష్ణ వివరించారు. మ్యాపింగ్ ప్రక్రియను ఖచ్చితంగా నిర్వహించాలని, తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అనుదీప్, ఆర్ఐ ప్రమోద్ కుమార్, జీపీఓ సత్యనారాయణ, బిఎల్‌ఓలు పాల్గొన్నారు.

మర్కుక్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గడేవ్‌పూర్ తహసీల్దార్ నిర్మలకు...



చిన్నకోడూరు తహశీల్దార్ కార్యాలయంలో...

అల్లాదుర్గంలో తహసీల్దార్‌కు...

ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

మర్కుక్, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త): ఉపాధ్యాయ, ఉద్యోగ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని పిఆర్‌టియు మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్‌రావు, కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఎంప్లాయిస్ జైన్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఆర్‌సి కమిటీ వేసి 30 నెలలు పూర్తయిన నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు 51 శాతం ఫిట్‌మెంట్‌తో జూన్ 2వ తేదీలోగా పిఆర్‌సిని అమలు చేయాలని, లేనిపక్షంలో టిజిఈ జేఏసి కార్యాచరణ ఉంటుందని తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పిఆర్‌సి బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి మల్లేశం, ఎస్‌జిటియు ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రెడ్డి, పిఆర్‌టియు నాయకులు నర్సింలు, షాబొద్దీన్, యాదిరెడ్డి, సరితాదేవి, గణేష్, శ్రీధర్, జిల్లా నాయకులు బాలకిషన్, ఉపాధ్యాయులు కేశవరెడ్డి, రమణారావు, రవీందర్‌రావు, విద్యాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుభాష్‌చందర్, వందన, జగన్నాథం, కృష్ణవేణి, స్వాతి, ఉమారాణి, సృజన, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్‌లో...

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం టిజిఈ జేఏసి నాయకులు జగదేవ్‌పూర్ తహసీల్దార్ నిర్మలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు టిఎస్ మండల అధ్యక్షుడు చిలుకూరి వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ తమకు రావాల్సిన పిఆర్‌సిని వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ అధ్యక్షుడు సత్తయ్య, యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి పరశురాములు, ఎస్‌జిటి అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, పిఆర్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి, శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు భగవాన్‌రెడ్డి, హరికిషన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నకోడూరులో...

చిన్నకోడూరు/తొగుట, ఏప్రిల్ 17,ప్రభాతవార్త : టిజిఈ జెఏసి పిలుపు మేరకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని చిన్నకోడూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ సలీంకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టిజిఈ జెఏసి మండల శాఖ అధ్యక్షులు దేవదాస్, ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి, నందకుమార్, నాగభూషణం, బాలస్వామి, సతీష్, విజయ,లతా, పద్మ, మాధవిలత, మమత, ప్రతిభ పాల్గొన్నారు.

తొగుటలో...

తొగుట మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో టిజిఈజెఏసి నిరసన కార్యక్రమంచేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ.13 వేల కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. 2023 డిఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలన్నారు.

గుమ్మడిదలలో...

గుమ్మడిదల, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త) : ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ డిమాండ్ చేసింది. డీఏ, పీఆర్సీ, ఆరోగ్య కార్డులు, వివిధ రకాల బకాయిల చెల్లింపులువంటి సమస్యలు వెంటనే పరిష్కరించాలంటూ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసనలో భాగంగా శుక్రవారం నల్ల బ్యాడ్జిలు ధరించి విధులకు హాజరైన ఉద్యోగులు, మధ్యాహ్నం సమయంలో తహసీల్దార్ పరమేశ్వర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రాజారెడ్డి, విజయ్ కుమార్, వినోద్ కుమార్, నాగరాజు, పెంచలయ్య, అలాగే కార్యకర్తలు మురళి, అప్పిరెడ్డి, ఝాన్సిలక్ష్మి, సునీత, మీనా తదితరులు పాల్గొన్నారు.

అల్లాదుర్గంలో...

అల్లాదుర్గం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అల్లాదుర్గంలో తహసీల్దార్ మల్లయ్యకు ఆయా సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు శుక్రవారం వినతి పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రెండవ పిఆర్సీ కమిషన్ రిపోర్టు తెప్పించుకుని జూన్ 2వ తేదీలోగా అమలు చేయాలన్నారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, పెన్షనర్ కుటుంబాలకు ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఉద్యోగులకు సంబంధించిన దీర్ఘకాలంగా ఉన్న 64 అంశాలలో పెండింగ్‌లో ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు.

జహీరాబాద్‌లో...

జహీరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర జేఏసి పిలుపు మేరకు శుక్రవారం స్థానిక జేఏసి నాయకులు పట్టణంలోని ఆర్‌డిఓ, తహసల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా జేఏసి నాయకులు మాట్లాడుతూ 4 ప్రధాన సమస్యలైన పిఆర్‌సిని అమలు చేయడం, పెండింగ్ బిల్లులను ఒకే దఫాలో చెల్లించడం, నూతన హెల్త్ కార్డులు మంజూరు చేయడం, సిపిఎస్‌ను రద్దు చేయడం లాంటి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిఆర్‌టియు టిఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ తులసిరామ్ రాథోడ్, టిఆర్‌ఈఎస్‌ఏ జిల్లా అసోసియేసన్ అధ్యక్షులు దశరథ్, యుటిఎప్ అధ్యక్షులు సిరాజొద్దిన్, టిపిటిఎఫ్ అధ్యక్షుడు జగదీశ్వరయ్య, రాంతీర్థ్ నర్సింలు, పిఆర్‌టియు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో వినతిపత్రం అందచేస్తున్న నాయకులు

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కొమురవెల్లి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సర్పంచ్ పచ్చిమడ్ల అనూష స్వామిగౌడ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని రసులాబాద్‌లో శుక్రవారం పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని మద్దతు ధరను పొందాలన్నారు. సన్న రకం వరి ధాన్యానికి రూ.500 బోనస్ వెంటనే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పిఏసిఎస్ సీఈవో రాములు, మాజీ సర్పంచ్ స్వామిగౌడ్, ఉప సర్పంచ్ సుదర్శన్, పంచాయతీ కార్యదర్శి బాలనర్సయ్య, మల్లేశం, బహదూర్, పరశురాములు, శ్రీకాంత్, మంజుల, లక్ష్మీ,గ్రామ పెద్దలు అబ్దుల్లా, ఎల్లయ్య, కనకయ్య, అనిల్, స్వామి, రమేష్, హమాలీ సంఘం కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మేస్త్రి సంఘం మండల ఉపాధ్యక్షుడికి సన్మానం

గజ్వేల్, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డుకు చెందిన సీర్ల కనకయ్యయాదవ్ మేస్త్రి సంఘం మండల ఉపాధ్యక్షునిగా ఇటీవల ఎన్నికకాగా శ్రీకృష్ణ యాదవ యువసేన ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ బిజెపి అధ్యక్షుడు మనోహర్‌యాదవ్, శ్రీకృష్ణ యాదవ సంఘం నాయకులు రాగిరి స్వామి, బాలకనకయ్య, ఆర్‌కె.యాదవ్, దేవులపల్లి యాదగిరి, కనకయ్య, చీర్ల బాబు, దాసరి కరుణాకర్, రమేష్, రాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు ఎంపి వ్యాఖ్యలు ఖండించాలి

కొండాపూర్, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త): బెంగళూరు ఎంపీ ఎస్ఎస్‌సి సూర్య పార్లమెంట్‌లో తెలంగాణపై చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్రంగా ఖండించాల్సినవని ఉద్యమకారుడు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు నర్సింహారెడ్డి అన్నారు. తెలంగాణను ఇండియా-పాకిస్తాన్‌లా విభజించారనే విధంగా మాట్లాడటం బాధాకరమని పేర్కొన్నారు. ఒక ప్రజాప్రతినిధిగా ఉన్న ఎంపీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని, ఇది తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు. అలాగే, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ వ్యాఖ్యలకు వత్తాసు పలకడం సరైంది కాదని నర్సింహారెడ్డి విమర్శించారు. తెలంగాణ ఉద్యమాన్ని గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఇలాంటి వ్యాఖ్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : తిరుమల శ్రీవారిని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో ఆలయ పండితులు వేద ఆశీర్వచనం అందించారు. శ్రీవారి ఆశీస్సులతో పటాన్ చెరు నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆర్థిక అభ్యున్నతి సాధించాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే జీఎంఆర్ తో పాటు సీనియర్ నాయకులు విజయ్ కుమార్, అశోక్, చంద్రశేఖర్, ఎమ్మెల్యే జీఎంఆర్ సోదరుడి కుమారుడు గూడెం సందీప్ రెడ్డి శ్రీవారిని దర్శించుకున్నారు.

ఎస్టీపీసీ నిర్మాణాన్ని నిలిపివేయాలి

మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడి

అమీన్‌పూర్, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త): జిహెచ్‌ఎంసి పరిధిలోని సర్వే నంబర్ 993లో నిర్మిస్తున్న ఎస్టీపీ(మురుగునీటి శుద్ధి కేంద్రం) వల్ల భవిష్యత్తులో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన కాలనీ వాసులతో కలిసి మాట్లాడుతూ, అమీన్పూర్ బీరంగూడ డివిజన్ల ప్రజలకు నష్టం కలిగించేలా ఈ ఎస్టీపీ నిర్మాణం చేపట్టారని విమర్శించారు. ఇసుక బాయి వాగు సమీపంలోని గుట్ట ప్రాంతంలో ఈ ప్లాంట్ ఏర్పాటు చేసి, మురుగు నీటిని శుద్ధి చేసి తరలించడం వల్ల పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు భవిష్యత్తులో అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు.ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు వెంటనే ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షి ంచి పనులను నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.అమీన్‌పూర్ ప్రాంతాన్ని అభివృద్ధి పనుల పేరుతో డంప్ యార్డ్, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఇప్పుడు ఎస్టీపీ నిర్మాణాలకు వినియోగించడం సరైంది కాదని ప్రశ్నించారు.ఇతర ప్రాంతాలైన రామచంద్రపురం, పటాన్చెరు ప్రాంతాలకు ఈ ప్రాజెక్టును తరలించాలని సూచించారు. ఇప్పటికే కాలనీ ప్రజలు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ అధికారులు స్పందించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.అమీన్పూర్ బయోడైవర్సిటీగా గుర్తింపు పొందిన పెద్ద చెరువు ఇప్పటికే కాలుష్యానికి గురైందని, దానిని కాపాడే చర్యలు చేపట్టాలని కోరారు. లేకపోతే అమీన్‌పూర్ ప్రజల తరఫున పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

2వ పిఆర్‌సిని అమలు చేయాలి

మిరుదొడ్డి, ఏప్రిల్ 17,ప్రభాతవార్త : ఉద్యోగ, ఉపాధ్యాయుల, కార్మిక, పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు మాట్లాడుతూ పిఆర్‌సి కమిటీ ఏర్పాటు చేసి 30 నెలలు పూర్తయిన నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు 51శాతం ఫిట్‌మెంటుతో తెలంగాణలో 2వ పిఆర్‌సిని అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు రూ.13 వేల కోట్లు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు రామచంద్రం,మహేందర్, కృష్ణ, సంపత్, తిరుపతిరెడ్డి, యాదగిరి, శ్రీకాంత్, రాజిరెడ్డి, కిష్టారెడ్డి,లోకేష్, హరిప్రసాద్, శ్రీనివాస్, బాలకిషన్, విద్యాప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందచేస్తున్న ఉద్యోగులు

పుల్‌కల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఎంప్లాయిస్ టీచర్స్, పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసి) నాయకులు డిమాండ్ చేశారు. టీజీఈజేఏసి రాష్ట్ర కమిటి పిలుపు మేరకు శుక్రవారం పుల్‌కల్, చౌటకూరు మండలాల్లోని పాఠశాలల ఉపాధ్యాయులు, ఆయా శాఖల ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. జూన్ 2వ తేదీనాటికి ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించడంతో పాగు పెండింగ్‌లో ఉన్న 5 డిఏలను విడుదల చేయాలని టీజీ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటి ప్రతినిధులు డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి పెండింగ్ బిల్లులను క్లియర్ చేసి విధుల్లో ఉన్న ఉద్యోగులకు హెల్త్ కారర్డులు తక్షణమే అమలు చేయాలి డిమాండ్ చేశారు. పుల్‌కల్ తహసీల్దార్ కృష్ణ, చౌటకూరు నాయబ్ తహసీల్దార్ సూరేపల్లి ఆనుదీప్‌లకు వినతి పత్రాలు అందచేశారు. ఆయాకార్యక్రమాల్లో టీజీఈజేఏసి బోగ లక్ష్మీనారాయణ, రామక్రిష్ణ ప్రహ్లాద్, నవీన్, శ్రీనివాసాచారి, బాలరాజ్, స్వప్న, నర్సింలు, రఘునాథ్‌రెడ్డి, అనిల్, చౌటకూరు రెవిన్యూ ఆర్ఐ ప్రమోద్‌కుమార్ జీపీఓల సంఘం జిల్లా అధ్యక్షులు నాయికోటి సత్యనారాయణ, బద్రి, నర్సింలు, లింగం, రమేశ్, ప్రవీణ్, సమీర్‌పాషా, సునీల్, అనిల్, లావణ్య, మనిషా, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

51 శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సి ప్రకటించాలి

కంది, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ శుక్రవారం కందిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు, టీజీఈజెఏసి జిల్లా కో-కన్వీనర్ ఎం సోమశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం 51 శాతం ఫిట్మెంట్‌తో పిఆర్‌సిని ప్రకటించాలని, డిఎలు, బిల్లులు విడుదలచేయాలన్నారు. మెమో 57 ప్రకారం ఓపిఎస్ అమలుచేయాలన్నారు. కార్యక్రమంలో పిఆర్‌టియు మండల అధ్యక్షుడు రాజు, మదన్‌మోహన్, కిషన్, రాజశేకర్, టిపిటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిద్దేశ్వర్, చంద్రమోహన్, యుటిఎఫ్ అధ్యక్షులు చందర్, ఆరుణశ్రీ, టిపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కమ్రుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షులు విజయ భాస్కర్ మామయ్య, రవి కుమార్ పాల్గొన్నారు.

లబ్దిదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానం

పుల్‌కల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 2025-26 వార్షిక సంవత్సరానికి సంబంధించిన పాడిగేదెల పంపణీకి అర్హులైన లబ్దిదారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, ఎస్‌పి కార్పోరేషన్ చైర్మన్ ఒక ప్రకటనలో కోరారు. ధరఖాస్తులను ఏప్రిల్ 23 వరకు స్వీకరించనున్నట్లు ప్రకటించారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కారర్డు, మీ సేవ ద్వార పొందిన ఆదాయ దృవీకరణ పత్రం, మున్సిపల్ పాస్ బుక్, నివాస దృవీకరణ పత్రం, బ్యాంక్ ఖాతా వివరాలు, ఫోటోలు జత చేసి ధరఖాస్తులు చేసుకోవాలన్నారు. వ్యవసాయ భూమి ఉన్న వారికి పాడి గేదెల కొరకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఎంపి తేజస్వీ సూర్య క్షమాపణ చెప్పాలి

బెజ్జంకి, ఏప్రిల్ 17,ప్రభాతవార్త : పార్లమెంట్‌లో తెలంగాణ ఏర్పాటును అవమానిస్తూ..పాకిస్తాన్‌తో పోల్చిన బిజెపి ఎంపి తేజస్వీ సూర్య తక్షణమే క్షమాపణలు చెప్పాలని సీపీఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలను కించపరిచేలా వ్యాఖ్యాలు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష చూపుతుందని బిజెపి ఎంపిలు రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు.

ఉపాధి హామీ కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

బెజ్జంకి, ఏప్రిల్ 17,ప్రభాతవార్త : ఉపాధి హామీ కూలీలకు పనులు చేసే ప్రదేశంలో వసతులు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఎండలు తీవ్ర రూపం దాల్చుతున్నాయని పని ప్రదేశంలో చల్లటి నీళ్లు, నీడ కోసం టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్యం కిట్లు, గ్రామం నుంచి పని దూరంగా ఉంటే రవాణా సౌకర్యం ప్రభుత్వమే ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి విబిజి రాంజీ పథకాన్ని తీసుకొచ్చిందని దీంతో కూలీలకు తీరని నష్టం జరుగుతుందన్నారు. కూలీలకు ప్రతి వారం కూలీ డబ్బులు చెల్లించాలన్నారు.

మహిళలకు ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త): మండల పరిధిలోని చాట్లపల్లి గ్రామంలో హాండ్ ఆఫ్ హెల్ప్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ జైపాల్‌రెడ్డి, తబితల ఆర్థిక సహకారంతో మహిళలకు ఉచితంగా టైలరింగ్ నేర్పించేందుకు శిక్షణ శిబిరాన్ని స్థానిక నాయకులు ఫాస్టర్ కిస్తఫర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో ఎదగాలనే ఉద్దేశంతో హాండ్ ఆఫ్ హెల్ప్ చారిటబుల్ ట్రస్టు వారు ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇస్తున్నారని, ఇవే కాకుండా వయోజన విద్య, అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామ మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మాసూరి కావ్య దర్గయ్య, జగదేవ్‌పూర్ ఫాస్టర్ యాకూబ్, ఉపసర్పంచ్ లింగారి కరుణాకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బరిగె నర్సింలు ముదిరాజ్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్, గ్రామస్తులు పరశురాములు, సైదిగారి శ్రీను, ఆశా కార్యకర్త మమత, శిక్షకురాలు కల్పన, మహిళలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి: సిఐ

చిలిపిచెడ్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : ట్రాఫిక్ స్కూల్స్ అందరూ పాటించాలని నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలోని శిలంపల్లి గ్రామంలో సర్పంచ్ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిఐ జాన్ రెడ్డి చేతుల మీదుగా గ్రామస్తులకు 100 హెల్మెట్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాన్ రెడ్డి మాట్లాడుతూ భారత దేశంలో 1,30,000 చనిపోతున్నారని తెలంగాణలో 7000 మంది, మెదక్ జిల్లాలో 600 నుంచి 700 మంది చనిపోయారని ఆయన అన్నారు.ఎస్పీ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నర్సింలు, ఉప సర్పంచ్ కిష్టారెడ్డి, నవీన్ రెడ్డి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 17,ప్రభాతవార్త : జిల్లా కేంద్రంలోని కాళ్లకుంట కాలనీలోగల అంగన్‌వాడీ కేంద్రాలు, గాడిచర్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బాలల ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన కల్పించే లక్ష్యంతో బలమేల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి అవసరమైన పోషకాహారంపై ప్రత్యేకంగా వివరించారు. అంగన్‌వాడీ సిబ్బంది పిల్లలకు సమతుల్య ఆహారం, శుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. అలాగే పిల్లల బరువు,ఎత్తు కొలతలు తీసి వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ఐసిడిసి సూపర్‌వైజర్ స్వప్న మాట్లాడుతూ బాల్యంలో సరైన పోషకాహారం అందితేనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార పథకాలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లులు పిల్లల ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. తల్లులకు పోషకాహార వంటకాలపై ప్రదర్శనలు నిర్వహించగా, పిల్లలకు ఆటలు, పాటల ద్వారా ఆసక్తికరంగా సందేశాలు అందించారు. పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, హెచ్‌ఎం శ్రీకాంత్, అంగన్‌వాడీ టీచర్లు లలిత, వినోద,. భాగ్యలక్ష్మీ, అరుణ,జ్యోతి,యమున తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువుల వినియోగంపై అవగాహన సదస్సు

కొల్చారం, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త): మండల కేంద్రంలోని పంచాయతీలో శుక్రవారం రైతులకు ఎరువుల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేవీకే శాస్త్రవేత్త డా. రవికుమార్ హాజరై మాట్లాడుతూ అధిక మొత్తంలో యూరియా, డీఏపీ వంటి రసాయన ఎరువులను వాడటం వల్ల భూమి సారం తగ్గిపోవడంతో పాటు పంట దిగుబడులు కూడా పడిపోతాయని తెలిపారు. అందువల్ల రైతులు పచ్చిరొట్టె ఎరువులు మరియు జీవన ఎరువులను వినియోగించాలని సూచించారు. వాటి ప్రయోజనాలు, వినియోగ విధానాన్ని రైతులకు సులభంగా అర్థమయ్యేలా వివరించారు.

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి, గ్రామ సర్పంచ్ దేవన్న రాజశేఖర్, వ్యవసాయ విస్తరణ అధికారి స్రవంతి, రైతులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

రామాయంపేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) పిలుపుమేరకు శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో తహసీల్దార్ రజని కుమారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత కొన్ని సమస్యలు పరిష్కారం అయినప్పటికీ, మరెన్నో సమస్యలు ఇంకా పరిష్కారానికి నోచుకోలేదని పేర్కొన్నారు. న్యాయబద్ధమైన డిమాండ్లు సైతం అమలుకు దూరంగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటివరకు వివిధ మార్గాల్లో సీఎస్, ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి ఈ అంశాలను తీసుకెళ్లినప్పటికీ, ఆశించిన స్థాయిలో స్పందన రాలేదని జేఏసీ నాయకులు తెలిపారు. వినతిపత్రాల ద్వారా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రధానంగా పలు కీలక డిమాండ్లను ప్రభుత్వం ముందుంచింది. జూన్ 2వ తేదీ నాటికి పీఆర్సీ అమలు చేయాలని, రిటైరైన ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని, హెల్త్‌కార్డులను అమలు చేయాలని కోరింది. అలాగే సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని, 2004 సెప్టెంబర్ 1కు ముందు నియమితులైన ఉద్యోగులకు ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేసింది. ఇదేకాకుండా పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, 61 సంవత్సరాలు నిండిన వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సాధారణ బదిలీలు చేపట్టాలని, సమస్యలను సమ యానుకూలంగా పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నవీన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గౌస్, జూనియర్ అసిస్టెంట్ కార్తీక్, జీపీఓలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ రజనికుమారికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఆలయంలో పట్లోల చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

ఎల్లమ్మదేవిని దర్శించుకున్న చంద్రశేఖర్‌రెడ్డి

నారాయణఖేడ్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : మండల పరిధిలోని ర్యాకల్ గ్రామంలోగల ఎల్లమ్మ మాతను కాంగ్రెస్ నేత పట్లోల చంద్రశేఖర్‌రెడ్డి దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని పాడిపంటలతో ప్రజలు చల్లగా ఉండాలని కోరుకున్నారు. ఈకార్యక్రమంలో పండరి రెడ్డి, మాజీ ఎంపీటీసీ, జ్ఞానేశ్వర్ సర్పంచ్, సంక్రిబాయ్ సర్పంచ్, విఠల్‌రావుపాటిల్ మాజీ సర్పంచ్, రామ్‌రెడ్డి, జైపాల్‌యాదవ్ ఉపసర్పంచ్. కౌన్సిలర్‌లు బాణపురం రాజుముదిరాజ్, మహేష్ సురేష్, పూజారి సాయిగౌడ్ పాల్గొన్నారు.

లక్ష్మీసుదర్శన యాగ పత్రిక ఆవిష్కరణ

యాగ పత్రికను ఆవిష్కరిస్తున్న మాధవానంద సరస్వతిస్వామి.

నారాయణఖేడ్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : మే 18 నుంచి జూన్ 15 వరకు మహతి జ్యోతిషాలయంలో జరగనున్న లక్ష్మీసుదర్శన యాగ పత్రికను రంగంపేట పీఠాధిపతులు మాధవానంద సరస్వతి స్వామి ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహతి జ్యోతిష్యాలయ వ్యవస్థాపకులు మల్కంచి గురురాజశర్మ, చిన్ని మధుకర్‌శర్మ, వేద పండితులు భక్తులు పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

వేం నరేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన ఎంపి

నరేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న సిఎం, ఎంపి సురేష్‌కుమార్

నారాయణఖేడ్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : రాజ్యసభ సభ్యులుగా ఎంపికైన వేం నరేందర్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్ హాజరై హార్ధిక శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మంత్రులు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, వనపర్తి డీసీసీ అధ్యక్షుడు శివసేనరెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

సిడిఎంఎ శ్రీదేవికి వినతిపత్రం అందచేస్తున్న మున్సిపల్ చైర్మన్

జహీరాబాద్, ఏప్రిల్ 17,ప్రభాతవార్త: జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులు నిధులు మంజూరు చేయాలని జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనూస్ సీడీఎంఏ శ్రీదేవికి వినతి చేశారు. హైదరాబాద్‌లోని మున్సిపల్ పరిపాలన సంచాలకుల కార్యాలయంలో కమిసనర్ శ్రీదేవికి మున్సిపల్ వైస్‌చైర్మన్ శిరీషసురేందర్‌రెడ్డి, కౌన్సిలర్లతో కలిసి చైర్మన్ మహమ్మద్ యూనూస్ వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా యూనూస్ మాట్లాడుతూ యుఐడిఎఫ్ పథకంలో జహీరాబాద్ మున్సిపల్‌కు 65 రకాల అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం గతంలోనే 18.70 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని, 16 పనులకు టెండర్లు పూర్తయినప్పటికి నిధుల విడుదలపై స్పష్టత లేకపోవడంతో పనులను కాంట్రాక్టర్ ప్రారంభించలేకపోతున్నారన్నారు. నిధులు మంజూరుచేస్తే పనులు పూర్తయి మున్సిపల్ అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. నిధుల మంజూరుకు సీడీఎంఏ శ్రీదేవి సానుకూలంగా స్పందించినట్లు చైర్మన్ యూనూస్ వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శిరీష సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు జాంగిర్, జమీల్, అక్రమ్ తదితరులు ఉన్నారు.

కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

నారాయణఖేడ్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : నేటి డిజిటల్ యుగంలో ప్రతి ఒక్కరూ కంప్యూటర్ రంగంలో ప్రావీణ్యం సంపాదించాలని, తద్వారా ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని 9వ వార్డు కౌన్సిలర్ బానాపురం రాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని సాహితీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎస్వీఎస్(ఎస్‌వీఎస్) టెక్నాలజీస్ కంప్యూటర్ శిక్షణకేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. స్వల్పకాలిక కోర్సు ద్వారా కంప్యూటర్ అప్లికేషన్స్‌లో డిప్లమా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు మధుసూదన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, జైపాల్, మనోజ్, మనోహర్, శ్యాంసన్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల మండల ఫోరం ఏకగ్రీవం

సిర్గాపూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: మండల పంచాయితీ కార్యదర్శుల ఫోరంను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర పంచాయితీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బలరాం ఆదేశాలు, జిల్లా ఫోరం అధ్యక్షులు నాగారం జగన్ సూచనల మేరకు నారాయణఖేడ్ టిఎన్‌జిఓ యూనిట్ ప్రధానకార్యదర్శి మిస్కిన్ అలీ అధ్యక్షతన మండల అధ్యక్షులుగా జి.అనిల్‌కుమార్, ప్రధానకార్యదర్శిగా గౌతమ్, గౌరవ అధ్యక్షులుగా జయరాం, కోశాధికారిగా నవీన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా నెహ్రూ, సుష్మ, సంయుక్త కార్యదర్శిగా మారుతి, శ్రీనివాస్, ఇసి సభ్యులుగా రఫీక్‌మియా, సాయిలు, దత్తురెడ్డి, వినయ్, వెంకటేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికలు తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ జిల్లా ఫోరం ప్రధాన కార్యదర్శి జె రాజు, సంయుక్త కార్యదర్శి బాలు, కమిటీ సభ్యులు జనార్దన్‌రెడ్డి హాజరవగా ఎన్నికల అధికారిగా ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి జె రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇదిలాఉండగా టిపిఎస్‌సిఎఫ్ 2026 డైరీని ఆవిష్కరించారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన మండల పంచాయతీ కార్యదర్శుల ఫోరం

ప్రభుత్వ ఉపాధ్యాయుల 'బడిబాట'

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచే లక్ష్యంతో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని మల్కాపూర్, గొట్టిముక్కల, బద్దారం గ్రామాలలో ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న ఉచిత విద్య, పుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలను వివరించారు. అలాగే పాఠశాలల్లో అమలు చేస్తున్న ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ తరగతులు, మెరుగైన బోధన విధానాల గురించి తల్లిదండ్రులకు తెలియజేశారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిద్ధిరాములు, రాణి, నాగవేణి, సౌజన్య తదితరులు ఉన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి : సిఐ

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : రహదారి నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని అల్లాదుర్గం సీఐ రేణుకరెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని టీటీడీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా సిఐ రేణుకా రెడ్డి మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, సీటుబెల్ట్ లేకుండా కార్లు నడపడం ప్రమాదాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. మద్యంతాగి వాహనాలు నడపడంవల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని, ఇటువంటి చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదంలో గాయపడినవారిని ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడే పౌరులకు కేంద్ర ప్రభుత్వం రహవీర్ బిరుదుతోపాటు రూ. 25 వేల నగదు బహుమతి అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాలు, తీసుకోవలసిన చర్యల గురించి పెద్దశంకరంపేట పోలీసులు రూపొందించిన వీడియోలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పెద్దశంకరంపేట, అల్లాదుర్గం, రేగోడ్ ఎస్సైలు ప్రవీణ్ రెడ్డి, శంకర్, పోచయ్య నాయకులు మురళి పంతులుతదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

కొల్చారం, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త): కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో బోధనేతర సిబ్బంది ఖాళీలను భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపల్ ఎం.ధరణి ఒక ప్రకటనలో తెలిపారు. నైట్‌వాచ్ ఉమెన్, కిచెన్ హెల్పర్ పోస్టులకు ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. అర్హతలు: నైట్‌వాచ్ ఉమెన్: 10వ తరగతి ఉత్తీర్ణత ఉండాలి. కిచెన్ హెల్పర్॥: కనీసం 7వ తరగతి వరకు చదివి ఉండాలి. దరఖాస్తు విధానం:అభ్యర్థులు తమ చేతిరాత దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు ప్రతులు, విద్యార్హతల బోనఫైడ్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు జతపరచాలి. సంప్రదించవలసిన నంబర్లు:9573082435, 9676435399 అర్హత గల మహిళలు వీలైనంత త్వరగా దరఖాస్తులు సమర్పించాలని ప్రిన్సిపల్ కోరారు.

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులపై నిర్లక్ష్యధోరణి వీడాలి

టిజిఇజెఏసి రాష్ట్ర సంఘాల డిమాండ్

కొండాపూర్, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులపై అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణిని వెంటనే విరమించుకోవాలని టిజిఇజెఏసి రాష్ట్ర సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా శుక్రవారం తాసిల్దార్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జిలతో నిరసన చేపట్టి, తహసీల్దార్ బి.అశోక్‌కు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ, ఉద్యోగుల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు ప్రధాన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలోని 206 సంఘాలకు చెందిన ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు కలిసి తీసుకున్న నిర్ణయం మేరకు రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా ఆందోళనలు కొనసాగుతున్నాయని తెలిపారు. వారి ప్రధాన డిమాండ్లు ఇవి:పిఆర్సి ను వెంటనే అమలు చేయాలి పెండింగ్ బిల్లులను చెల్లించాలి ఉద్యోగులు, పెన్షనర్లకు ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలి కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి ఈ నాలుగు సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో భారీ స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని టిజిఇజెఏసి రాష్ట్ర సంఘాలు హెచ్చరించాయి.



తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఉద్యోగ ఉపాధ్యాయులకు వెంటనే పిఆర్‌సి ఇవ్వాలి

పాపన్నపేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: ఉద్యోగ ఉపాధ్యాయులకు వెంటనే పిఆర్సీ ప్రకటించాలని తపస్ జిల్లా కోశాధికారి మంగ నరసింహులు మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పాపన్నపేట తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పిఆర్సితోపాటు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను, హెల్త్ కార్డులను ఇవ్వాలని పాతపెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తులసిరామ్, రమేష్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

12వ వార్డులో తాగునీటి సమస్య పరిష్కారం

బోరు వేస్తున్న దృశ్యం

సదాశివపేట, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త): పట్టణంలోని 12వ వార్డులో రానున్న ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండడానికి కాంగ్రెస్ పార్టీకి చెందిన 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత రాజు మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులతో రెండు కొత్త బోరుబావులను వేయించారు. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సదా శివపేట మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, పులిమామిడి రాజు పాల్గొని బోరుమోటారుకు భూమి పూజ నిర్వహించి బోరుమోటారును స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, గణేష్, పిఎంఆర్ యువసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

నర్సాపూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న ఉద్యోగుల, ఉపాధ్యాయుల, పెన్షనర్ల, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని ఆర్డిఓ కార్యాలయం ముందు టీజీ ఈ జేఏసీ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టి జి ఈ జేఏసీ నాయకులు మాట్లాడుతూ 2023 జూలై నుంచి అమలు కావలసిన పిఆర్సి ఇప్పటివరకు అమలు కాలేదన్నారు. వెంటనే పిఆర్సి నివేదిక తెప్పించుకొని 51 ఫిట్మెంట్ ప్రకటించి అమలు చేయాలన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓ పి ఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని, హెల్త్ కార్డ్స్ వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డిఓ రామకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిజిఈ జేఏసీ నాయకులు శ్రీనివాసరావు, వెంకటేష్, మొహిజొద్దీన్, స్వప్న, రవి గంగాధర్, జ్యోతి, బీమ్లా, శ్రీనివాస్, సత్యనారాయణ, గంగారాం, మల్లారెడ్డి, నిమ్మయ్య, దన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు

ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న టీజీఈజేఏసీ నాయకులు

నిరసన తెలుపుతున్న డివిజన్ ఉద్యోగులు

నల్ల బ్యాడ్జీలు ధరించి ఉద్యోగుల నిరసన

సిర్గాపూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ టిజిఈజెఏసి పిలుపు మేరకు నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని ఉద్యోగులు శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి సిర్గాపూర్‌లోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిఎన్‌జిఓ నారాయణఖేడ్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మొమహ్మద్ మిస్కిన్, పంచాయతీకార్యదర్శుల ఫోరం జిల్లా ప్రధానకార్యదర్శి జె.రాజు, జిల్లా సంయుక్త కార్యదర్శి బాలు, జిల్లా ఈసీ సభ్యులు జనార్ధన్‌రెడ్డిలు హాజరై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మొమహ్మద్ మిస్కిన్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పీఆర్సీని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డిఏలను, బిల్లులను ఒకే విడతలో విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొగుడంపల్లిలో...

తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

మొగుడంపల్లి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉద్యోగులు మొగుడంపల్లిలో నల్లబ్యాడ్జీలు ధరించి మధ్యాహ్న భోజన విరామసమయంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసి సంఘాల పిలుపు మేరకు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద ఉద్యోగులు నిరసన వ్యక్తంచేసి తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఉద్యోగులు వినతి పత్రాలు అందచేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకునేలా ఒత్తిడి తేవాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది, ఆయా శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

బిజెపి ఎంపి తేజస్వి సూర్య వ్యాఖ్యలకు ఖండన

జహీరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: తెలంగాణ ఏర్పాటుపై కర్ణాటక బిజెపి ఎంపి తేజస్వీసూర్య పార్లమెంట్ సభలో చేసిన వాఖ్యలు దేశ ఐక్యతను దెబ్బతీసేలా ఉన్నాయని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విభజనను భారత్, పాకిస్తాన్ విభజనతో ఎంపి తేజస్వీ సూర్య పోల్చడాన్ని నరోత్తం ఖండించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అన్నివర్గాల ప్రజల దీర్ఘకాల పోరాట ఫలితం అని, రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్య బద్ధంగా ఏర్పడిందని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన తేజస్వి సూర్యను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, పార్లమెంట్ పదవికి కళంకం తెచ్చిన తేజస్వీ సూర్యను పార్లమెంట్ సభ్యత్వాన్ని రాజీనామా చేయాలని, తెలుగు రాష్ట్రాల ప్రజలకు క్షమాపణ చెప్పాలని నరోత్తం డిమాండ్ చేశారు.

సీమ ఆంజనేయస్వామి ఆలయంలో హరినామ కీర్తన

సిర్గాపూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: మండల పరిధిలోని పంచముఖి గ్రామ శివారులోని సీమ ఆంజనేయస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అఖండ హరినామ సప్త కార్యక్రమాలు నేత్రపర్వంగా భక్తులు జరుపుకున్నారు సప్తహ ముగింపును పురస్కరించుకుని భక్తులు నిండు కలశాలతో ఊరేగింపుగా ఆడుతూ పాడుతూ పల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కరణ్ గజేంద్ర భారతి మహారాజ్ కాలా కార్తీన సేవ కార్యక్రమం శోభాయమానంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరణ్ గజేంద్ర భారతి మహారాజ్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఆధ్యాత్మికతతో ముందుకు సాగితే జీవనం ప్రశాంతంగా సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీమా హనుమాన్ దేవస్థానం ధార్మిక ఆధ్యాత్మిక సేవా సదన్ ట్రస్ట్ సభ్యులు, గ్రామపెద్దలు, ట్రస్ట్ సభ్యులు పట్లోళ్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

హిందూ సమ్మేళన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఝరాసంగం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 19న ఝరాసంగంలోని లింగాయత్ సత్రంలో ఉదయం 10 గంటలకు హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మాలిపటేల్ శ్రీనివాస్, మనోజ్‌కుమార్ తెలిపారు. సమ్మేళనానికి బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతులు మండలేశ్వర సిద్దేశ్వరానందగిరి మహారాజ్, ధనసిరి పీఠాధిపతితి వివచార్య వీరయ్యస్వామి, విశ్వహిందూ పరిషత్ క్షేత్ర ప్రముఖ్ పండరీనాథ్, ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ కొప్పుల రవి, దుర్గావాహిని ఉత్తర కర్నాటక సహ సంయోజక్ అనసూజరెడ్డి హాజరువుతున్నారన్నారు. కళాకారులచే పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సమ్మేళనానికి హిందువులు పెద్ద సంఖ్యలో చేరుకుని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

బిఆర్ఎస్ చేరిన వివిధ పార్టీల నాయకులు

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : పెద్దశంకరంపేట మండలం శివాయిపల్లి, కట్టెల వెంకటాపూర్ గ్రామాలకు చెందిన పలువురు మాజీ మంత్రి హరీష్‌రావు, నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లోని హరీష్ రావు నివాసంలో వారు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. శివాయిపల్లి స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థిగా పోటీచేసిన చిల్కముక్కు మల్లేషం, వార్డు సభ్యుడు దండు నర్సింలు, చంద్రయ్య, బేతయ్య, ప్రవీణ్,రత్నయ్య, రాములుతో పాటు కట్టెల వెంకటాపూర్కు చెందిన బీజేపి నాయకులు భాను తో పటు పలువురు బీఆర్ఎస్లో చేరారు. వీరందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామాలలో బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, నాయకులు సురేష్ గౌడ్, బోండ్ల దత్తు, సుభాష్, అంజయ్య, శంకర్ గౌడ్ తదితరులున్నారు.



హరీష్‌రావు సమక్షంలో బిఆర్ఎస్ చేరిన వివిధ పార్టీల నాయకులు

అర్హులైన పేదలకు పక్కా ఇళ్లు మంజూరు చేయాలి : ఎమ్మెల్యే

లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు

నర్సాపూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : అర్హులైన పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని ఎమ్మెల్యే సునీతరెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలనలో 174 మంది లబ్దిదారులు దరఖాస్తులు చేసుకోగా 50మందికి మాత్రమే ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కెసిఆర్ నేతృత్వంలో నర్సాపూర్‌లోని పేదలైన ప్రజల కోసం 500 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేసిందన్నారు. అదేవిధంగా సీతారాంపూర్ గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరుచేసి కాలనీలను ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారని ఇందులో ఎమ్మెల్యే కోట కింద 1400 కేటాయించారన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోసం గుడిసెలో, రేకుల ఇల్లు, పెంకుటిల్లు గలవారే అర్హులని వారికే మొదటి విడతలో మంజూరు అవుతాయని తెలిపారు. మిగతా అర్హులైన లబ్ధిదారులకు రెండో విడతలో మంజూరవుతాయని ఆమె తెలిపారు. ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు భోగ చంద్రశేఖర్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ శివకుమార్, కౌన్సిలర్ కండెల రాజు, పట్టణ అధ్యక్షుడు పంబల్ల బిక్షపతి, నాయకులు సత్యంగౌడ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మధుకర్ రెడ్డి, సర్పంచ్ కొండల్ రెడ్డి,నాయకులు సుదీప్, లింగాపూర్ లక్ష్మీ నరసయ్య, మాజీ సర్పంచ్ లు అశోక్, కర్ణాకర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరు పట్టాలు అందజేత...

వెల్దుర్తి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : మండలంలోని ఉప్పులింగాపూర్ గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే సునీతరెడ్డి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను వేగవంతంగా నిర్మించుకోవాలన్నారు. మాజీ జెడ్పిటిసి రమేష్ గౌడ్. స్థానిక సర్పంచ్ భూపాల్ రెడ్డి. స్థానిక ఎంపీడీవో ఉమాదేవి. సర్పంచ్లు రంగారెడ్డి. కృష్ణ. ఇందిర మహిళ లబ్ధిదారులు. ఏ శాఖల అధికారులు నాయకులు పాల్గొన్నారు.